

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 03-12-2022 సంపుటి : 04 సంచిక :91 పేజీలు : 4 వెల : రూ 3-00

# పరిపూర్ణమైన విద్యకు మార్కులే ప్రామాణికం కాదు



అమరావతి డిసెంబర్ 2 మార్కులు తెచ్చుకోవటమే విద్యాభ్యాసం కాదని, జ్ఞానాన్ని, నైపుణ్యాలను పెంచుకోవడమే విద్య అని రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. సాంకేతిక విద్యా శాఖ గత మూడు రోజులుగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పాలీ టెక్ ఫెస్ట్ 2022 ముగింపు కార్యక్రమం నగరంలోని ఎస్ ఎస్ కన్వేన్షన్ లో వేడుకగా సాగింది. విజేతలుగా నిలిచిన విద్యార్ధులకు బహుమతులు అందచేసారు.

**రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత**
**ప్రపంచపోటీని తట్టుకనేలా విద్యాబోధన : జోగి**
**పరిశ్రమతో సాంకేతిక విద్య అనుసంధానం : చదలవాడ**
**ప్రతిభ ప్రదర్శించిన విద్యార్దులకు నగదు బహుమతులు**
**ఘనంగాముగిసినపాలీటెక్ఫెస్ట్ 2022**

ముఖ్య అతిధిగా హాజరైన వనిత మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించే అద్భుతమైన ప్రాజెక్టులను రూపొందించిన విద్యార్థులు అభినందనీయులన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహాన్ని కొనసాగించి ఉజ్వల భవిష్యత్తు సొంతం చేసుకోవాలన్నారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను స్వీకరించి, వాటిని అధికమించేందుకు సిద్ధం కావాలన్నారు. స్వార్ధ ప్రయోజనాల గురించి ఏనాడూ ఆలోచించని ముఖ్యమంత్రి విద్యార్థుల కోసం విభిన్న పథకాలను అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి శాస్త్ర వేత్తలని, ప్రపంచ పోటీని తట్టుకునేలా ప్రతి విద్యార్థి తయారు కావాలన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు, మాతృభూమికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. విద్యార్థులు తమ నైతిక ప్రవర్తనను పెంపొందించుకోవాలని, సమాజాన్ని ఇబ్బంది పెట్టేలా నడవడిక ఉండరాదని ఉ ద్బోదించారు. విద్యార్థుల సంక్షేమం, ఉపాధి కోసం ఎన్నో ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్నమన్నారు.సాంకేతిక విద్యాశాఖ సంచాలకురాలు చదలవాడ నాగరాణి మాట్లాడుతూ తగిన ప్రోత్సాహం అందిస్తే విద్యార్ధులు తమదైన శైలిలో రాణిస్తారన్న విషయం ఈ టెక్ ఫెస్ట్ నిరూపించిందన్నారు. ఇకపై ప్రతి సంవత్సరం ఈ సాంకేతిక ఉత్సవాన్ని నిర్వహించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. ముఖమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆలోచనల మేరకు సాంకేతిక విద్యను పరిశ్రమతో అనుసంధానం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎపి ఇన్నోవేషన్ సొసైటీ సిఇఓ అనిల్ కుమార్, సాంకేతిక విద్యాశాఖ సంయిక్త సంచాలకులు పద్మారావు కార్యదర్శి విజయ భాస్కర్, ఇతర అధికారులు సత్యనారాయణ మూర్తి, ఎ.నిర్మల్ కుమార్ ప్రియ తదితరులు పాల్గొన్నారు. టెక్ ఫెస్ట్ లోగో రూపకల్పనలో దాదాపు 90 మంది పాలిటెక్నిక్‌లు పాల్గొనగా, గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ విద్యర్థులు ఉత్తమమైన లోగో రూపొందించి ఐదువేల రూపాయల నగదు బహుమతి పొందారు.పాలీ టెక్ ఫెస్ట్ లో విజేతలు : 253 ప్రాజెక్టులలో లక్ష రూపాయల రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి అనకాపల్లి జిల్లా చోడవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ బృందం రూపొందించిన "స్మార్ట్ స్టిక్ ఫర్ విజువల్లీ ఛాలెంజ్డ్" కు దక్కింది.

## న్యాయవ్యవస్థ స్వతంత్రంగా పనిచేస్తేనే న్యాయం జరుగుతుంది: ఏపీ అడ్వొకేట్ జేఏసీ

అమరావతి: న్యాయవ్యవస్థ స్వతంత్రంగా పనిచేసినపుడే కక్షిదారులకు న్యాయం జరుగుతుందని ఏపీ అడ్వొకేట్ జేఏసీ అభిప్రాయపడింది. ఏపీ అడ్వొకేట్ జేఏసీకి చెందిన పలువురు న్యాయవాదులు రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్‌ను కలిసి వినతిపత్రం అందించారు.అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. ఏపీ హైకోర్టు న్యాయమూర్తుల బదిలీలను నిలిపివేయాలని గవర్నర్‌ను కోరినట్లు చెప్పారు.ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ డి. రమేష్‌లను కొలీజియం సిఫార్సు మేరకు బదిలీ చేయడం సరికాదన్నారు. ఇది సాధారణ బదిలీల్లో భాగంగా జరిగింది కాదని అడ్వొకేట్ జేఏసీ న్యాయవాదులు పేర్కొన్నారు. ఈ అంశంపై గవర్నర్, ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను కూడా కలిసి వివరించినట్లు చెప్పారు. దీనిపై గవర్నర్ సానుకూలంగా స్పందించారన్నారు. అడ్వొకేట్ జేఏసీ అభ్యంతరాలను రాష్ట్రపతికి పంపాలని గవర్నర్‌ను కోరినట్లు చెప్పారు. ఈనెల 4న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విజయవాడకు రానున్నారని.. ఆమెను కలిసి వినతిపత్రం ఇచ్చే అవకాశం కల్పించాలని గవర్నర్‌ను కోరామని న్యాయవాదులు వివరించారు.



# 2024 తర్వాత చంద్రబాబుకు అదే పరిస్థితి



అమరావతి: రామోజీరావు ఎన్ని జాకీలు పెట్టి లేపినా బాబు లేచే పరిస్థితి లేదని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. శుక్రవారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, తనకు ఇవే చివరి ఎన్నికలని చంద్రబాబు అంటున్నారని, బాబుతో ఇదే కర్మ అంటూ జనం అంటున్నారని పేర్ని నాని ఎద్దేవా చేశారు.బయట ధరలు ఎలా ఉన్నాయి. హెరిటేజ్‌లో ఎంత ఉన్నాయి?. రామోజీ అమ్మే ప్రియ ఆయిల్స్ రేట్లు ఎంత ఉ న్నాయి? అంటూ ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు డ్రామాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు."హైదరాబాద్‌లో ఏపీ వారు చాలా మందే ఉన్నారు. అక్కడి నిత్యావసర వస్తువుల రేట్లు ఎలా ఉన్నాయో ఒకసారి కనుక్కో చంద్రబాబూ. ఇతర రాష్ట్రాల్లోని రేట్లు, ఇక్కడా ఒకేలా ఎందుకు ఉన్నాయి?. జనం అమాయకులని చంద్రబాబు అనుకుంటున్నారు. ప్రజలు తిరగపడి బాదేవరకు చంద్రబాబు ఇలానే మాట్లాడతారు. కాంతారావు, రాజనాల సినిమాల్లోని డైలాగులు ఇంకా చెప్తే ఎలా?" అని పేర్ని నాని ప్రశ్నించారు.మల్లెల బాబ్జీ మరణ వాంగ్మూలం ఇచ్చేవరకు చంద్రబాబు కుట్ర తెలియలేదు. లేకపోతే అప్పట్లోనే ఎన్టీఆర్ ని చంపేసేవారు. 2024 తర్వాత చంద్రబాబు కూడా ఎన్టీఆర్ లాగా మానసికంగా కుంగిపోవాల్సిందే. సంక్షేమ పథకాల వలన రాష్ట్రం శ్రీలంక అవుతుందని మొన్నటి దాకా భోరుమని ఏడ్చారు. ఇప్పుడేమో అంతకన్నా ఎక్కువ సంక్షేమం అందిస్తామని అంటున్నారు. పవన్, చంద్రబాబును చూస్తే జాలేస్తుంది. జగన్ సత్తా ఏంటో వారిద్దరికీ ఇప్పుడు తెలిసొచ్చింది" అని పేర్ని నాని అన్నారు

## కొడాలి నానిపై మండిపడ్డ టీడీపీ నేతలు

గుడివాడ ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు గెలిపిస్తే నిరుపేదలకు బీఫారం పట్టాలు ఇప్పిస్తానన్న ఎమ్మెల్యే కొడాలి నానికు, ఇప్పుడు తమ సమస్యలను తెలియచేస్తే కోర్టులకు వెళ్లి పరిష్కరించుకోండంటూ సమాధానం ఇస్తున్నాడని గుడివాడ కొత్తపేట మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు.టిడిపి మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో గుడివాడ ఏడవ వార్డులో ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులోకి వచ్చిన రావికు ఎదురు వచ్చి, స్థానిక మహిళలు తమ గోడు వెళ్ళబోసుకున్నారు. కొత్తపేటలో గడపగడపకు వచ్చినప్పుడు ఎమ్మెల్యే కొడాలి నాని టిడిపిను విమర్శించిన చోటే కూర్చొని, గుడివాడ అభివృద్ధిపై చర్చకు రావాలంటూ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వర రావు సవాల్ విసిరారు. చెత్త మీద పన్ను వేసే చెత్త ప్రభుత్వానికి ప్రజలు కష్టాలు ఏం తెలుస్తాయని రావి ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తే చైర్మన్ పదవిపై వైసీపీలో వర్గ విభేదాలు వస్తాయన్న భయంతో, ఎన్నికలు జరగకుండా కొడాలి నాని అడ్డుకుంటున్నాడని , అధికార పార్టీ గ్రూపు రాజకీయాలకు మున్సిపల్ ఎన్నికలు జరిగక ప్రజలు కష్టపడడం ఏంటని రావి వెంకటేశ్వర రావు ప్రశ్నించారు.

## ఇస్రో నంబి నారాయణ్‌పై కుట్ర కేసు.. సుప్రీంకోర్టు కీలక తీర్పు

దిల్లీ: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) గూఢచర్యం కేసులో సుప్రీంకోర్టు శుక్రవారం కీలక తీర్పు వెలువరించింది. గూఢచర్యం వ్యవహారంలో శాస్త్రవేత్త నంబి నారాయణ్‌ను ఇరికించారన్న కేసులో మాజీ డీజీపీ సహా నలుగురు నిందితులకు కేరళ హైకోర్టు మంజూరు చేసిన ముందస్తు బెయిల్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది.ఈ కేసును తిరిగి హైకోర్టుకే బదిలీ చేస్తున్నామని.. దీనిపై నాలుగు వారాల్లో నిర్ణయం



తీసుకోవాలని ఆదేశించింది.1994లో క్రయోజనిక్ ఇంజిన్ తయారీకి సంబంధించిన కీలక పత్రాలను శాస్త్రవేత్త నంబి నారాయణ్ విదేశీయులకు అప్పగించారంటూ కేరళ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం న్యాయస్థానం ఈ కేసును కొట్టివేసింది. క్రయోజనిక్ ఇంజిన్ పనులు ఆలస్యం కావాలన్న విదేశీ కుట్రలో భాగంగానే కేరళ పోలీసులు నంబి నారాయణ్‌పై ఈ ఆరోపణలు చేశారంటూ సీబీఐ కేసు నమోదు చేసింది. అప్పటి పోలీసు అధికారులైన గుజరాత్ మాజీ డీజీపీ ఆర్.బి.శ్రీకుమార్, విశ్రాంత నిఘా అధికారి పి.ఎస్.జయ్‌ప్రకాశ్, ఇద్దరు పోలీసు అధికారులు ఎస్.విజయన్, థంపి ఎస్ దుర్గా దత్‌పై కేసులు పెట్టింది. అయితే వారికి కేరళ హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.దీంతో హైకోర్టు తీర్పుపై సీబీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. నంబి నారాయణ్‌పై కేసు పెట్టడం ద్వారా క్రయోజనిక్ ప్రాజెక్టు పనులు ఆగిపోయాయని, రోదసీ కార్యక్రమాలు ఒకటి, రెండు దశాబ్దాల పాటు వెనకబడ్డాయని సీబీఐ వాదించింది. ఇది చాలా తీవ్రమైన అంశమని, విదేశీ కుట్రలో భాగమై పోలీసులు ఇలా చేసి ఉ ండవచ్చని తెలిపింది. నిందితులకు బెయిల్ ఇస్తే.. విచారణకు ఆటంకం కలుగుతుందని పేర్కొంది. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ ఎం.ఆర్. షా, జస్టిస్ సి.టి. రవికుమార్ ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది."సీబీఐ అప్పీళ్లను అంగీకరిస్తున్నాం. ఈ కేసులో నిందితులకు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేస్తున్నాం. ఈ కేసుకు సంబంధించిన అన్ని పిటిషన్లను తిరిగి హైకోర్టుకే పంపిస్తున్నాం. నిందితుల బెయిల్ దరఖాస్తులను మళ్లీ మొదటి నుంచి విచారించండి. నాలుగు వారాల్లోగా దీనిపై తీర్పు వెలువరించండి" అని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. అయితే ముందస్తు బెయిల్ దరఖాస్తులపై కోర్టు తీర్పు వెలువరించేదాకా నిందితులను అరెస్టు చేయకుండా వారికి రక్షణ కల్పించింది.

## ఏపీలో పలు ఆసుపత్రుల్లో ఈడీ సోదాలు.. నిధుల దారి మళ్లింపు?

విజయవాడ: ఏపీలోని పలు ఆసుపత్రుల్లో ఈడీ సోదాలు చేపట్టింది. మంగళగిరిలోని ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో ఈడీ తనిఖీలు చేస్తోంది.ఆసుపత్రిలో రికార్డులను ఈడీ అధికారులు పరిశీలిస్తున్నారు. రెండు బృందాలుగా విడిపోయి అధికారులు రికార్డులు తనిఖీ చేస్తున్నారు. ఎన్ఆర్ఐ ఆసుపత్రి సొసైటీ సభ్యుల ఇళ్లలోనూ సోదాలు చేపట్టారు. విజయవాడ అక్కినేని ఉమెన్స్ ఆసుపత్రిలోనూ ఈడీ తనిఖీలు నిర్వహిస్తుంది.ఆసుపత్రి సిబ్బంది ఫోన్లను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆసుపత్రి ఛైర్మన్‌తో సహా సిబ్బందిని ఈడీ ప్రశ్నించింది. అమెరికాలో వైద్యురాలుగా ఉంటూ విజయవాడలో అక్కినేని ఉమెన్స్ ఆసుపత్రిని అక్కినేని మణి ప్రారంభించారు. విదేశీ నిధులు అక్రమంగా దారి మళ్లింపు చేశారనే ఆరోపణల నేపథ్యంలో ఈడీ తనిఖీలు చేపట్టింది. గతంలో ఎన్నారై ఆసుపత్రిలో డైరెక్టర్‌గా అక్కినేని మణి వ్యవహరించారు. అక్కినేని మణిని ఈడీ అధికారులు రహస్యంగా విచారిస్తున్నారు.ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో భారీగా అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై ఈడీ సోదాలు నిర్వహిస్తోంది. కోవిడ్ సమయంలోనూ భారీగా అవతవకలకు పాల్పడ్డారని గతంలోనే కేసు నమోదైంది. మాన్యువల్‌రసీదులు, నకిలీ రసీదులతో నిధులను పక్కదారి మళ్లించారనే అభియోగాలు నమోదయ్యాయి. కోవిడ్ సమయంలో ట్రీట్‌మెంట్ తీసుకున్న 1500 మంది పేషెంట్ల వివరాలను రికార్డుల్లో చేర్చలేదని గతంలోనే అధికారులు పేర్కొన్నారు. కొంత మంది ఉద్యోగుల సహకారంతో దొంగ ఖాతాలకు నగదు మళ్లింపులు జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఎన్నారై హాస్పటల్‌కి సంబంధించి పరికరాల కొనుగోళ్లపై అవకతవకలు జరిగాయని ఆరోపణలు రాగా, ఎంబీబీఎస్ ఫీజు రూపంలో కూడా కోట్లాది రూపాయల మేర అవకతవకలు జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. ఈ మేరకు గతంలో పనిచేసిన డైరెక్టర్లు నిమ్మగడ్డ ఉపేంద్రనాథ్, అక్కినేని మణి, ఉప్పాల శ్రీనివాసరావు, నళిని మోహన్‌లు ఈడీ అధికారలు విచారిస్తున్నారు.



## సీఎం జగన్ సభలకు హాజరయ్యేందుకే డ్వాక్రా సంఘాలు: చంద్రబాబు

కొవ్వూరు: మహిళా శక్తి అంటే ఏంటో మళ్లీ ప్రపంచానికి చాటి చెప్పాల్సిన సమయం వచ్చిందని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పిలుపునిచ్చారు.పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకొని రాష్ట్రంలోని మహిళలను ఎవరు పైకి తీసుకొచ్చారో.. ఎవరు మోసం



చేస్తున్నారో బేరీజు వేసుకోవాలని మహిళలకు సూచించారు. పశ్చిమ గోదావరి జిల్లా పర్యటనలో ఉన్న ఆయన.. కొవ్వూరులోని డ్వాక్రా, అంగన్వాడీ, పొదుపు సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. సమావేశంలో చంద్రబాబు మాట్లాడు తూ.. "డ్వాక్రా సంఘాల స్వయం సాధికారత స్ఫూర్తిని సీఎం జగన్ దెబ్బతీశారు. సీఎం మాటలు కోటలు దాటుతున్నాయి.. కానీ, అమలు మాత్రం గడప దాటట్లేదు. ఇచ్చే డబ్బుకు, సీఎం దోచుకునే దానికి పొంతన లేదు. మహిళలు తమ ఇంటి ఆర్థిక పరిస్థితిని బేరీజు వేసుకోవాలి. గత 4ఏళ్లలో మీ ఖర్చులు పెరిగిపోయాయా.. లేదా? అనేది చూసుకోవాలి. మీ కొనుగోలు శక్తి తగ్గిందో లేదో ఆలోచన చేయాలి. కేవలం తన సభలకు హాజరు కావడం కోసమే డ్వాక్రా సంఘాలను సీఎం జగన్ వినియోగించుకుంటున్నారు. మహిళల ఆత్మగౌరవానికి తెదేపా మరుగుదొడ్లు కట్టిస్తే, వాటిపైనా పన్ను విధించిన ఘనత ఈ ముఖ్యమంత్రికే దక్కుతుంది. తెదేపా అధికారంలోకి రాగానే మళ్లీ డ్వాక్రా సంఘాలను బలోపేతం చేస్తాం. మహిళలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా పైకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తాం" అని చంద్రబాబు తెలిపారు.

# సంపాదకీయం

శనివారం 03-12-2022

## ప్రజలకు అందని పెట్రో తగ్గింపు

పెట్రోల్, డీజిల్ రేట్లు రోజూ మారతాయి. దీని కోసం ఓ విధానం ఉంది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ రేట్లు పెరిగితే ఇక్కడా పెంచుతారు. అందుకే –లాక్‌డౌన్ సమయంలో 80 రూపాయిలు ఉండే పెట్రోల్ ధర ఇప్పుడు రూ. 110కి చేరింది. మరి అలాంటప్పుడు క్రూడాయిల్ ధరలు తగ్గితే తగ్గాలి కదా !. కానీ తగ్గడం లేదు. మార్చితో పోలిస్తే క్రూడాయిల్ ధరలు 20 శాతానికి పైగా పడిపోయాయి. కానీ పెట్రో ధర మాత్రం పైసా కూడా తగ్గలేదు. కేంద్రం అలాంటి ఆలోచన చేయడం లేదు. అంతర్జాతీయంగా ధరలు పెరిగినప్పుడు పెంచుతూ.. తగ్గినప్పుడు మాత్రం సైలెంట్‌గా ఉంటోంది కేంద్రం. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు భారీగా తగ్గుతున్నాయి. తాజాగా పదినెలల కనిష్టానికి చేరాయి. ఈ ఏడాది మార్చిలో బ్యారెల్ క్రూడాయిల్ ధర 112.87 డాలర్లుగా గా ఉంది. ఇప్పుడు అంటే డిసెంబర్‌కు వచ్చే సరికి ఆ ధర 88 డాలర్ల దరిదాపుల్లో ఉంది. జులైలో బ్యారెల్ ధర 105.49 డాలర్లగా ఉండగా, ఆగస్టులో రూ. 97.40కి,. సెప్టెంబర్‌లో రూ. 90.71కి తగ్గింది. అక్టోబర్‌లో స్వల్పంగా పెరిగి 91.70కి స్వల్పంగా పెరిగినప్పటికీ నవంబర్‌లో 88.66 డాలర్లకు పడిపోయింది. ఇది ఈ ఏడాది జనవరి నెలలో ఉన్న ధరలతో దాదాపు సమానం. పెరిగినప్పుడు ప్రతీ రోజా పావలా.. చొప్పున పెంచిన ఆయిల్ కంపెనీలు ఇప్పుడు ఏమీ తెలియనట్లే ఉంటున్నాయి. క్రూడాయిల్ ధరలు పతనం అయినప్పటికీ సామాన్య ప్రజలకు పది రూపాయల ప్రయోజనం కూడా ఇవ్వడానికి కేంద్రం సిద్ధపడటం లేదు. 'మరికొంత కాలం ధరలు ఇలానే ఉంటాయి...' అనే సంకేతాలు పంపుతున్నారు. పెట్రోల్, డీజిల్ రిటల్ ధరలో సగం కన్న ఎక్కువ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న పన్నులే. ఎక్సైజ్ సుంకం ద్వారానే కేంద్ర ఖజానాకు లక్షల కోట్లు సమకూరుతున్నాయి. సెస్‌లు దానికి అదనం. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు తగ్గడంతో, రిటైల్ మార్కెట్‌లోనూ తగ్గాలి. కానీ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరితో మరి కొంత కాలం రిటైల్ షాపుల వద్ద భారీ ధరలు కొనసాగనున్నాయి. ఆలోగా అంతర్జాతీయంగా ధరలు పెరిగితే ఇక్కడ కూడా పెరుగుతాయి. అందులో ఎలాంటి మోహమాటాలు పెట్టుకోరు అధికారులు. మన దేశంలో పెట్రో ధరలపై 60శాతానికి పైగా పన్నుపోటు కొనసాగుతోంది. కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకం పేరుతో రూ.32.90 మేర బాదుతుండగా.. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు దాదాపు 36 శాతం దాకా వ్యాట్‌ను విధిస్తున్నాయి. కొన్ని రాష్ట్రాలైతే వ్యాట్‌కు అధనంగా లీటరుపై రూ.2–రూ.4 దాకా అదనంగా వసూలు చేస్తున్నాయి.ప్రస్తుతం పడిపోతున్న క్రూడాయిల్ ధరలు.. పెట్రోల్, డీజిల్ ధరలపై కంపెనీలు పొందిన నష్టాలను కవర్ చేసుకుంటున్నాయని కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. క్రూడాయిల్ ధరలు పెరిగి, రూపాయి పతనమవుతోన్న సమయంలో.. పెట్రోల్, డీజిల్ ధరలను స్థిరంగా ఉంచి కంపెనీలు నష్టాలను భరించాయని.. లీటరు పెట్రోల్, డీజిల్‌పై రూ.12 నుంచి రూ.15 మేర నష్టాన్ని పొందాయంటున్నారు. కారణంతో ఇప్పుడిప్పుడే అంతర్జాతీయంగా తగ్గుతోన్న ధరలకు అనుగుణంగా..వాటిని భర్తీ చేసుకుంటున్నాయని అంటున్నారు. రూపాయి పడిపోతుండటంతో.. ధరల విషయంలో కంపెనీలు కాస్త వేచిచూసే ధోరణిని ప్రదర్శిస్తున్నాయి. దేశంలో ద్రవ్యోల్బణం ఆందోళనలు ఉన్న నేపథ్యంలో ఆ పరిస్థితి నుంచి కేంద్రాన్ని గట్టెక్కించేందుకు చమురు సంస్థలు ధరలను తగ్గించడం లేదనే వాదనలూ ఉన్నాయి.

## భోగాపురం భూములు మాత్రం బంగారం

శ్రీకాకుళం, డిసెంబర్ 2, అంతర్జాతీయ స్థాయిలో భారీ హంగులతో నిర్మించాలని ఎయిర్ పోర్టు ఆలోచన ఏడేళ్ల క్రితం తెలుగుదేశం ప్రభుత్వానికి వచ్చింది. దానికి సంబంధించి శంకుస్థాపన కూడా చేశారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత పనులు జరగలేదు. జీఎంఆర్‌కు దక్కిన కాంట్రాక్ట్ రద్దు చేయడం ఐదు వందల ఎకరాలు తగ్గించి మళ్లీ జీఎంఆర్‌కే ఇవ్వడంలో ఆలస్యం జరిగింది. మొదట్లో 15000 ఎకరాలతో ప్రారంభమైన ఇక్కడ భూసేకరణ చివరకు2700 ఎకరాలకు కుదించుకుపోయింది. ప్రధానమంత్రి కూడా భోగాపురం ఎయిర్పోర్ట్ త్వరలోనే రెడీ అవుతుందని చెప్పడంతో అక్కడ భూములకు రెక్కలు వచ్చాయి. ఒకప్పుడు బీడు భూములు పనికిరావు అనుకున్న భూములకి ఏకంగా కోట్ల రూపాయలే విలువలు పలుకుతున్నాయి. ఎయిర్ పోర్ట్ భూములు అనేసరికి ఎక్కడ లేని వారందరూ కూడా ఇక్కడికి వచ్చి కొనుగోలు చేస్తున్నారు. కొంతమంది రైతులు భూములకు రేట్లు వస్తున్న సమయంలో అమ్మకాలు ఆపేశారు. రానున్న రోజుల్లో ఇంకా రేటు పెరుగుతుంది కనుక అమ్మడానికి సిద్ధంగా లేవని కొంతమంది భూములను అలాగే ఉంచేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టంలో భాగంగాగ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ ను కేంద్ర ప్రభుత్వం ఏపీకి కేటాయించింది. అధునాతనంగా, భారీ ఎత్తున తలపెట్టిన ఈ ఎయిర్ పోర్టు నిర్మాణానికి తొలుత 15 వేల ఎకరాలను సేకరించేందుకు ప్రతిపాదలనలు సిద్ధం చేశారు. అయితే దీనిపై స్థానికుల అందోళనలతో అది సుమారు ఐదున్నర వేల ఎకరాలకు, ఆ తర్వాత అది 2 వేల 7 వందల ఎకరాలకు కుదించారు. 2019 ఫిబ్రవరిలో అప్పటీ ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టుకు శంఖుస్థాపన కూడా చేశారు.అప్పటీ నుంచి ఇప్పటీ వరకు ఈ ఎయిర్ పోర్టుకు సంబంధించి ఆ శిలాఫలకం తప్ప మరొక ఇటుక కూడా పడలేదు. ఈ తరుణంలో విమానాశ్రయ నిర్మాణ పనున్ని ప్రారంభించాలని ప్రస్తుత ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.. దీంతో అక్కడ ప్రజలు ఒక్కసారిగా భూములు రేట్లు పెరగడంతో ఎయిర్పోర్ట్ పేరుతో భూములకు భారీగా రేట్లు వచ్చి పడ్డాయి చుట్టుపక్కల కనుచూపుల మేర వరకు కూడా భూములు అమ్మకానికి లేకుండా పోయే పరిస్థితి ఏర్పడింది. విమానాశ్రయం నిర్మాణాన్ని పీపీపీ (పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్ షిప్) పద్ధతిలో జీఎంఆర్ సంస్థ నిర్మించనుంది. శంఖుస్థాపన జరిగి మూడేళ్లైనా కూడా ఇప్పటీ వరకు ఎయిర్ పోర్టుకు సంబంధిచిన పని ప్రారంభం కాలేదు. కానీ భోగాపురం ఎయిర్ పోర్టు ప్రకటన వచ్చినప్పటీ నుంచి భోగాపురం చుట్టూ పక్కల 10 కిలోమీటర్ల వరకు రియల్ ఎస్టేట్ వ్యాపారం మాత్రం జోరందుకుంది. ఎయిర్ పోర్టు వస్తుందనే వార్తలతో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు మధ్యలో ఉండే భోగాపురం, దాని సమీప ప్రాంతాల్లో భూముల ధరలు ఊహకందని విధంగా పెరిగాయి.ఎయిర్ పోర్ట్ ప్రతిపాదన రాకముందు ఎకరా 20 లక్షలు, 30 లక్షలు ఉండేది. ఇప్పుడు ది కోటి, రెండు కోట్లు అయిపోయింది. హైవే దగ్గరైతే 10 కోట్లు కూడా అయింది . కొంత లోపలికి వెళితే రెండు కోట్లు, మూడు కోట్లకు వస్తుంది. ప్రస్తుతం బోగాపురం ప్రాంతంలో రైతులంతా భూములు అమ్మేసుకున్నారు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ ఓనర్ల దగ్గరే భూములు ఉన్నాయి. వ్యాపారవేత్తలు బాగా కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల మరోపక్క విశాఖపట్నం క్యాపిటల్ గా ఏర్పడుతుందని చెప్పడంతో మరి కాస్త రేట్లు పెరిగాయి. చిన్నాచితకా రైతులు కూడా కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారని వారి భవిష్యత్తు చాలా బాగుందని అభివృద్ధికి ఇదే పునాదిని అంటున్నారు.

## దెందులూరులో పొలిటికల్ హీట్

ఏలూరు, డిసెంబర్ 1, 2019 అసెంబ్లీ ఎన్నికలు దెందులూరు రాజకీయ ముఖ చిత్రాన్ని మార్చేశాయి. తనకు ఎదురే లేదని అనుకున్న టీడీపీ నేత చింతమనేని ప్రభాకర్ ఓడిపోగా.. అక్కడ వైసీపీ నుంచి పోటీ చేసిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కొఠారు అబ్బయ్య చౌదరి గెలిచారు. వైసీపీ రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో.. సీన్ మారిపోయింది. దెందులూరులో పొలిటికల్ గేమ్ కూడా ఆ స్థాయిలో రక్తికట్టిందనే చెప్పాలి. ఇప్పటికీ నియోజకవర్గంలో నేతల మధ్య రాజకీయ చదరంగం నడుస్తోంది. అయితే, గత ఎన్నికల్లో ఓడినా దూకుడు తగ్గించని చింతమనేని ఈ మూడున్నరేళ్ల కాలంలో అనేక కేసుల్లో ఇరుక్కున్నారు. ఆయన పరిస్థితి పోలీస్ స్టేషన్ లేదా కోర్టు లేదా జైలు అన్నట్టుగా మారిపోయింది. తాజాగా బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహిస్తున్న ఆయనపై మరికొన్ని కేసులు నమోదయ్యాయి.ఈ కేసులకు చింతమనేని విరుగుడు మంత్రం వేస్తున్నారని ఆ మధ్య ప్రచారం జరిగింది. అది ఎంత వరకు వచ్చిందో ఏమో.. కొద్దికాలం సైలెంట్ అయ్యారు. దెందులూరులో పూర్తిగా వైసీపీదే హవా. అక్కడ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి చెప్పిందే నడుస్తుంది. అయితే ఇన్నాళ్లు ఇద్దరి మధ్య సాగిన రాజకీయ ఎత్తుగడలు.. సరిపోవని అనుకున్నారో ఏమో.. ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు మార్చేశారు. పందెంకోళ్ళ మాదిరి కాలు దువ్వుతున్నారు. బాదుడే బాదుడు కార్యక్రమంలో పాల్గొంటున్న చింతమనేని మరోసారి తన నోటికి పని చెబుతున్నారు. ఓ రేంజ్‌లో బూతులు వాడేస్తున్నారని తెలుగు తమ్ముళ్లే గగ్గోలు పెడుతున్నారు. వైసీపీపై విమర్శలు చేయొచ్చు కానీ.. ఈ స్థాయిలో బాదుడు ఉంటే.. అసలుకే ఎసరు రావొచ్చని వాళ్లు ఆందోళన చెందుతున్నారట. ఈ దూకుడే 2019 ఎన్నికల్లో ఓడించిందనేది వారి అభిప్రాయం. మళ్లీ అదే ఫార్ములాను నమ్ముకుంటే ఎన్నికల్లో బోల్తా పడే ప్రమాదం ఉందని కేడర్ హెచ్చరిస్తోందట. వార్ వన్‌సైడ్ చేసుకోవద్దని హితవు పలుకుతున్నారట.ఇక ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరిది మరో తీరు. దెందులూరు రాజకీయాల్లో తానేమీ తక్కువ కాదన్నట్టుగా జూలు విదిలిస్తున్నారు. సరైనోడు తగలనంత వరకు ఎవరైనా పేలతారని చింతమనేనికి ఘాటుగానే కౌంటర్లు వేస్తున్నారు. ఇప్పుడు శాంపిల్స్ చూస్తున్నారని.. అసలు సినిమా ముందు ఉందని రాజకీయ ప్రత్యర్థికి చిన్నపాటి వార్నింగ్‌లు ఇస్తున్నారు. తనకు ఎదురొచ్చి సత్తా చాటుకోవాలని సవాళ్లు విసురుతున్నారు ఎమ్మెల్యే. వచ్చే ఎన్నికల్లో దెందులూరులో గెలిచేది వైసీపీనేనని.. అందులో అనుమానమే అక్కర్లేదనేది అబ్బయ్య చౌదరి వాదన. ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే మధ్య తాజాగా జరుగుతున్న ఈ మాటల యుద్ధమే దెందులూరులో పొలిటికల్ అటెన్షన్ తీసుకొస్తోంది. అయితే వచ్చే ఎన్నికలే లక్ష్యంగా ఇద్దరూ పావులు కదుపుతుండటం ఆ హీట్ గ్రౌండ్ లెవల్‌కూ పాకుతోంది. మరి.. ఎవరి వ్యూహాలు వర్కవుట్ అవుతాయో కాలమే చెప్పాలి.

## గుంటూరు కార్పొరేషన్ లో హోర్డింగ్ లొల్లి

గుంటూరు, డిసెంబర్ 2,గుంటూరు కార్పోరేషన్‌లో అధికారులుపై అధికార పక్షం నేతలు మరోసారి విరుచుకుపడ్డారు. మొన్నటికి మొన్న టౌన్‌ప్లానింగ్‌లో అక్రమాలు అంటూ విరుచుకుపడిన నేతలు ఇప్పుడు ప్రకటనల హోర్డింగ్‌ల ఏర్పాటులో అవినీతిపై నిలదీయటం కలకలం రేపింది.గుంటూరు నగరపాలక సంస్థలోని ప్రణాళిక విభాగంలో ప్రకటన బోర్డుల నిర్వహణ, ఫీజుల వసూళ్లలో జరుగున్న అవినీతిపై చర్చకు వచ్చింది. కొన్నేళ్లుగా ప్రకటనల హోర్డింగ్స్ ఏర్పాటు, వాటి నుంచి వచ్చే అద్దెల్లో వ్యత్యాసం ఉంటుందని వైసీపీ ఆరోపించింది. అధికారుల అవినీతి బయటకు రానీయకుండా జాగ్రత్తలు పడుతున్నారంటూ వైసీపీ కార్పోరేటర్లు అధికారిక సమావేశంలోనే ప్రస్తావించారు. కోట్లలో అవినీతి జరుగుతోందని, పాలకవర్గం వచ్చిన తరువాత కూడా అవినీతికి అడ్డు లేకుండాపోయిందని వైసీపీకి చెందిన కార్పొరేటర్లు షేక్ రోషన్, అచ్చాల వెంకట రెడ్డి, వెంకటకృష్ణ ఆచారి ఆగ్రహం వ్యక్తం చేశారు. నగర పాలక సంస్థ అధికారిక సమావేశంలోనే ఈ అంశం ప్రస్తావనకు రావటంతో మేయర్‌సహా మున్సిపల్ కమిషనర్ కూడా ఖంగుతినాల్సి వచ్చింది. ప్రకటన బోర్డుల అవినీతిపై గతంలోనే పలుమార్లు కౌన్సిల్ సమావేశాల్లో చర్చించినప్పటికి అధికారుల తీరులో మార్పు లేదని కార్పోరేటర్లు ఫైర్ అయ్యారు. భవానీ యాడ్స్ అనే సంస్థకు చెందిన వ్యక్తులు మరికొన్ని డమ్మీ సంస్థలను ఏర్పాటు చేసి, పట్టణ ప్రణాళిక అధికారులతో కుమ్మక్కై దందా సాగిస్తున్నారని ఆరోపించారు. నగరంలో 75 శాతం వరకు ప్రకటన బోర్డులు ఏర్పాటు చేయిస్తున్నారంటూ కార్పోరేటర్లు కామెంట్ చేశారు. ప్రకటనల ద్వారా లక్షలు ఆర్జిస్తున్న వ్యక్తి ఒకరు జీఎంసీకి చెల్లింపులు చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఇందులో అధికారుల భాగస్వామ్యం లేకుండా జరుగుతుందని తాము అనుకోవటం లేదని వ్యాఖ్యానించారు.ఈ వ్యవహారంపై గుంటూరు నగర పాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారి మూర్తి, డీసీపీ కోటయ్య వివరణ ఇచ్చారు. నగరంలో బోర్డులు, హోర్డింగ్స్ తదితర వాటి గురించి వివరాలను కౌన్సిల్ ముందు ఉంచారు. అయితే అధికారుల లెక్కలపై కార్పోరేటర్లు మరిన్ని అనుమానాలు వ్యక్తం చేశారు. అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు తమ తీరు మార్చుకోవాలని, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్లు డిమాండు చేశారు. గడప గడప' కార్యక్రమంలో ప్రజల వద్దకు వెళ్తుంటే స్థానిక సమస్యలపై నిలదీస్తున్నారని పలువురు కార్పొరేటర్లతోపాటు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా కూడా తమ ఆవేదన వెలిబుచ్చారు. ప్రజలు చిన్న చిన్న పనులు చేయించాలని అడుతున్నారని, వాటిని కూడా పూర్తి చేయించలేని పరిస్థితుల్లో ప్రజల్లోకి ఎలా వెళ్లతామని వ్యాఖ్యానించారు.సమావేశంలో కూడా టౌన్ ప్లానింగ్‌లో అవినీతి వ్యవహారాలపై నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలోనే వైసీపీ కార్పోరేటర్లే స్వయంగా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై అధికారులు తాత్కాలికంగా వివరణ ఇచ్చినప్పటికి ఆ తరువాత కూడా అదే తంతు కొనసాగుతుందని కార్పోరేటర్లు గుర్రుగా ఉన్నారు. గుంటూరు కార్పోరేషన్ పరిధిలో ఇళ్ళ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చే విషయంలో జరుగుతున్న అవినీతిపై వైసీపీ కార్పోరేటర్లు ఆరోపణలు చేశారు. ఇప్పుడు కూడా అదే టౌన్ ప్లానింగ్‌లో ప్రకటనల హోర్డింగ్‌ల రూపంలో అవినీతి ఆరోపణలు రావటం, అది కూడా వైసీపీ కార్పోరేటర్లే ప్రస్తావించటంపై చర్చ జరుగుతుంది.

## అర్ధరాత్రి బస్సు బోల్తా..

### ఒకరు మృతి..పలువ్వురికి గాయాలు

చిత్తూరు చిత్తూరు జిల్లా పలమనేర్ సమీపంలోని కేటల్ ఫారం వద్ద జాతీయ రహదారిపై రోడ్డు ప్మాదం జరిగింది. బెంగళూరు నుంచి విజయవాడ వెళ్తున్న ప్రైవేటు బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఘటన జరిగిన సమయంలో బస్సులో సుమారు 30 మంది ప్రయాణికులు వున్నారు. గుంటూరు చెందిన ఒకరు మృతి చెందారు. పలువురు ప్రయాణికులు గాయపడ్డారని సమాచారం. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడిన వ్యక్తులని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు

## టీచర్ల ఎన్నికల విధులకు దూరం చేసే వ్యూహమా ?

విజయవాడ, డిసెంబర్ 2, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బోధనేతర విధులకు టీచర్లను దూరంగా ఉండాలని ఆర్డినెన్స్ తీసుకు వస్తోంది. బోధనేతర పనుల వల్ల విద్యార్థులకు పాఠాలు చెప్పడంపై శ్రద్ధ పెట్టలేకపోతున్నారని ఈ పరిస్థితిని నివారించడానికి ఈ నిర్ణయం తీసుకున్నామని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఏపీ ప్రభుత్వం ముందస్తు ఎన్నికల దిశగా ఆలోచిస్తోంది. మంత్రి సీదిరి అప్పలరాజు ఈ విషయాన్ని బహిరంగంగానే చెప్పారు. ఎన్నికలు రావొచ్చన్నారు. ప్రతిపక్ష పార్టీల నేతలు అలా చెబితే.. పార్టీ క్యాడర్‌ను సన్నద్ధం చేయడానికి చెబుతాయి. కానీ ఇక్కడ మంత్రే ప్రకటించారు. పై స్థాయి నుంచి సంకేతాలు రాకపోతే మంత్రి అలా ప్రకటించరు. అందుకే ముందస్తు ఎన్నికల కోణంలోనే ఈ బోధనేతర పనులు కేటాయింపును కూడా రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు. టీచర్లు లేకపోతే ఎన్నికల నిర్వహణ కష్టం అయిపోతుంది. అప్పుడు ఎన్నికల నిధులు నిర్వహించే వారి కోసం కష్టపడాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వం ఇటీవల గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రొబేషన్ ఇచ్చింది. వారు పర్మినెంట్ ఉద్యోగులయ్యారు. వారందరికీ విధులు ఇస్తే టీచర్లు లేని లోటును భర్తీ చేయవచ్చని అంచనా వేస్తున్నారు. అయితే విపక్ష పార్టీలు వీరిని ఎన్నికల విధుల్లో వినియోగించుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకించే అవకాశం ఉంది. అందుకే ఈ అంశంపై ముందు ముందు కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. బోధనేతర విధులు వద్దని ఉపాధ్యాయులు చాలా కాలంగా ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఉపాధ్యాయులకు ఎన్నో బోధనేతర విధులు ఇచ్చారు. ఓ సందర్భంగా మద్యం దుకాణాల వద్ద కూడా డ్యూటీలు వేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు ప్రభుత్వం ఎలాంటి పనులూ చెప్పబోమని అంటోంది. అయితే ఆర్డినెన్స్ తెచ్చినా.. ప్రభుత్వం అనధికారికంగా వారి సేవలను మౌఖిక ఆదేశాల ద్వారా ఉపయోగించుకోగలదు. కానీ ఎన్నికల సేవలు మాత్రం అలా కాదు. బోధనేతర విధులు వద్దని చాలా కాలంగా టీచర్లు కూడా డిమాండ్ చేస్తున్నారు. అందుకే ఈ నిర్ణయాన్ని టీచర్లు కూడా వ్యతిరేకించే అవకాశం లేదు.కానీ టీచర్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నందున.. వారికి కేవలం ఎన్నికల విధులు ఇవ్వకుండా ఉండటానికే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్న వాదన ఎక్కువగా వినిపిస్తోంది. సాధారణంగా ఎన్నికల విధుల్లో టీచర్లే ఎక్కువగా ఉంటారు. ఎన్నికలు సాధారణంగా స్కూళ్లకు సెలవులు ఉన్న సమయంలో జరుగుతాయి. ఉపఎన్నికలు.. ఇతర ఎన్నికలు స్కూల్స్ నడుస్తున్న సమయంలో జరిగితే..సెలవు ఇస్తారు. సుదీర్ఘకాలంగా ఎన్నికలు అంటే తొలుత టీచర్లే గుర్తుకువచ్చేలా వారిని వినియోగించుకుంటున్నారు. ఓట్ల జాబితాల పరిశీలన నుంచి ఎన్నికల రోజు ఓటింగ్ వరకు వారే ఉంటారు. సార్వత్రిక ఎన్నికలైనా, ఉప ఎన్నికలైనా ఎన్నిక సజావుగా సాగేలా చూస్తూంటారు. అందుకే టీచర్లు లేని ఎన్నికల ప్రక్రియను ఊహించడం కష్టం. కానీ ఇప్పుడు ఏపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల వారు ఎన్నికల విధులకు దూరం అవుతారు. బోధనేతర పనులు అంటే ఇక ఏ ఇతర పనినీ టీచర్లు చేయకూడదు. అప్పుడు సాధారణ పనులతో కీలకమైన ఎన్నికలు కూడా వారి నుంచి దూరమవుతాయి. జగన్ ప్రభుత్వంపై టీచర్లు వ్యతిరేకతతో ఉన్నారనేది బహిరంగ రహస్యం. వారి డిమాండ్లు అటుంచి అసలు జీతాలు, సాధారణ ఆర్థిక ప్రయోజనాలు , సీపీఎస్ రద్దు వంటి అంశాల్లో ప్రభుత్వం తీరు వారికి నచ్చడం లేదు. అందుకే ఉద్యమాలు చేస్తున్నారు. అందుకే గతేడాది విజయవాడలో నిర్వహించిన భారీ ధర్నాలో ఉపాధ్యాయులకే కీలక పాత్ర పోషించి, అది విజయవంతం అవ్వడానికి కారణమయ్యారు. అనంతరం కొత్తగా ప్రవేశపెట్టిన ముఖ ఆధారిత హాజరుపై పెద్దఎత్తున వ్యతిరేకత వ్యక్తమైంది. ఇప్పటికే పలురకాల మొబైల్ యాప్‌లతో సతమతమవుతున్న టీచర్లలో తీవ్ర అసంతృప్తి కనిపిస్తోంది. తమపై వ్యతిరేకత ఉన్న వారు ఎన్నికల విధుల్లో భాగం అయితే ఇబ్బందికర పరిస్థితులు వస్తాయన్న కారణంగా ప్రభుత్వం.. వారిని ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలనే ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా భావిస్తున్నారు.

## స్టీల్ ప్లాంట్ పై సియం వైఎస్ జగన్ ప్రకటన చేయాలి

### :సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య

కడప సిటి డిసెంబర్ 2 కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి పోరాడి సాధిస్తానన్న కడప స్టీల్ ప్లాంట్ గత మూడు సంవత్సరాలుగా పనులు ఎందుకు మొదలు కాలేదనే దానిపైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్పష్టత ఇవ్వాలని కారణాలు బహిర్గతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి ఈశ్వరయ్య డిమాండ్ చేశారు.సిపిఐ నగర సమితి సమావేశం శుక్రవారం హోచిమిన్ భవన్ యందు నాగరాజు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.ముఖ్య అతిథిగా హాజరైన ఈశ్వరయ్య మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ నిర్మాణంకై సిపిఐ నేతృత్వంలో కన్యతీర్థం నుండి కడప కలెక్టర్ కార్యాలయం వరకు డిశంబర్ 9నుండి 13 వరకు చేపట్ట బోతున్న పాదయాత్రలకు అన్ని రంగాల ప్రజలు మద్దతు కూడాగట్టాలన్నారు.రాష్ట్ర విభజన సందర్భంగా యూపీఏ ప్రభుత్వం కడప జిల్లాలో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ నిర్మించాలని ఆ రోజు చట్టంలో పెట్టడం జరిగిందనీ గుర్తు చేశారు. స్టీల్ ప్లాంట్ నిర్మాణము జరిగి ఉంటే కడప జిల్లా నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఉపాధి లభించేదని, పారిశ్రామికంగా అభివృద్ధిచెందిఉండేదన్నారు.వైఎస్సార్ స్టీల్స్ లిమిటెడ్ పేరుతో 25 వేల కోట్లు ఖర్చు చేసి ఏడాదికి 30 లక్షల టన్నుల సామర్థ్యంతో 15 వేల మందికి ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామని, మూడు సంవత్సరాల లోపల పూర్తి చేసి ప్రారంభిస్తామని 2019 డిసెంబర్ 23న జమ్మలమడుగు మండలంలోని సున్నపురాళ్లు పెద్ద దండ్లూరు మధ్యసిఎం జగన్ శంకుస్థాపన చేసి ప్రజా సమక్షంలో వాగ్దానం చేశారని తెలిపారు. పది రోజుల్లో మూడు సంవత్సరాలు పూర్తి కావస్తున్నప్పటికీ రోడ్డు సౌకర్యం కాని ప్రహరీ గోడ కూడ పూర్తి కాలేదని ఎక్కడి వేసిన గొంగళి అన్న చందంగా ఉక్కు కర్మాగారం నిర్మాణం ఉందన్నారు .భారత కమ్యూనిస్టు పార్టీ 5 రోజుల పాదయాత్రలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి ఓబులేసు, జి ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు, సమితి సభ్యులు బాగాస్వామ్య మవుతున్నారని తెలిపారు.సంఘీభావంగా సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శి కె.నారాయణ, పార్లమెంట్ సభ్యులు బినయ్ విశ్వం పాల్గొన్న పోతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ,నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ, నగర సహాయ కార్యదర్శి కేసి. బాదుల్లా, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు, వేణుగోపాల్, విజయలక్ష్మి, గంగాసురేష్ నగర సమితి సభ్యులు సావంత్ సుధాకర్, ఓబయ్య, మునయ్య, మల్లికార్జున, మనోహర్ రెడ్డి, బ్రహ్మం ,నాయక్ ,ఆర్ బాబు మైనుద్దీన్, నారాయణ, బీమరాజు ,భాగ్యలక్ష్మి, ఆచారమ్మ తదితరులు పాల్గొన్నారు

## బదిలీ అయిన ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం

డోన్,:బదిలి అయినా ఉపాధ్యాయులకు డోన్ కొత్తపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులు గంగిరెడ్డి అధ్యక్షత వహించి ఈ సన్మాన కార్యక్రమం జరిపారు, తెలుగు ఉపాధ్యాయులు లోకనాథ్ రెడ్డి వాక్యత చేయగా సోషల్ ఉపాధ్యాయులు ప్రకాష్ రెడ్డి సన్మాన ఉపాధ్యాయుల గురుంచి మాట్లాడుతూ ఈ పాఠశాలలో సాయిరాం మోహన్ గత 9 సంవత్సరాలనుండి విద్యార్థులకు మంచి విద్య బోధనచేసి,పాఠశాల అభివృద్ధికి కృషి చేసారు ,అని తెలిపారు, సన్మాన ఉపాధ్యాయులు సాయి రామ్ మోహన్ ను ,యస్ యస్ ఉపాధ్యాయులు మద్దయ్య ను , మాథ్స్ ఉపాధ్యాయులు వివేక్ ను,పి యస్ ఉపాధ్యాయురాలు సునంద ను, హిందీ ఉపాధ్యాయురాలు ప్రశాంతి లను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానం చేసారు,ఈ కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయులు నాగయ్య గుప్త, పి యస్ ఉపాధ్యాయురాలు నాగ లక్ష్మమ్మ, యస్ యస్ ఉపాధ్యాయురాలు లక్ష్మి, హిందీ ఉపాధ్యాయురాలు నూర్జహాన్,పుష్ప లత, డ్రాయింగ్ ఉపాధ్యాయులు రజనీకాంత్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# వైసీపీ గూటికి ముద్రగడ పద్మనాభం



కాకినాడ, డిసెంబర్ 1, గతంలో ఎమ్మెల్యేగా.. మంత్రిగా.. ఎంపీగా పనిచేసిన అనుభవం ముద్రగడ పద్మనాభానికి ఉంది. సమయానుకూలంగా పార్టీలు మారుతూ కొన్నిసార్లు సక్సెస్ అయ్యారు.. మరికొన్నిసార్లు ఫెయిల్ అయ్యారు. 1994లో తొలిసారి ప్రత్తిపాడులో ఓడిన తర్వాత.. ఇక జీవితంలో ఆ నియోజకవర్గం నుంచి పోటీ చేయాబోనని భీష్మించారు. 2009లో కాంగ్రెస్ పార్టీ సీట్ ఆఫర్ చేయడంతో పిఠాపురంలో పోటీ చేసినా.. ఆ సీటును ప్రజారాజ్యం పార్టీ గెల్చుకుంది. ఆపై ప్రత్యక్ష రాజకీయాలకు దూరం జరిగి.. కాపు ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశారు. తర్వాత జరిగిన కొన్ని పరిణామాలతో ఆ ఉద్యమానికి సైతం గుడ్‌బై చెప్పారు ముద్రగడ. 2014, 2019 ఎన్నికల సమయంలో ఆయన వైసీపీలో చేరతారని ప్రచారం జరిగినా.. ఎటూ వెళ్లలేదు. కానీ.. త్వరలో వైసీపీ కండువా కప్పుకొంటారని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తోంది.అధికార వైసీపీ నేతలు ముద్రగడను ఫ్యాన్ గాలి కింద కూర్చోబెట్టేందుకు గ్రౌండ్ ప్రిపేర్ చేస్తున్నట్టు టాక్. అయితే సీట్ల దగ్గర పంచాయితీ తేలడం లేదని తెలుస్తోంది. ముద్రగడను ప్రత్తిపాడు ఎమ్మెల్యే లేదా కాకినాడ ఎంపీగా పోటీ చేయాలనే ప్రతిపాదన వచ్చిందట. అయితే ఆ రెండింటినీ ఆయన సున్నితంగా తిరస్కరించినట్టు సమాచారం. తాను బతికుండగా ప్రత్తిపాడు నుంచి పోటీ చేయబోనని.. ఒకవేళ బరిలో ఉండాల్సి వస్తే.. పార్లమెంట్ సీటుపైనా ఆసక్తి లేదని.. అసెంబ్లీకి అయితే ఒకే అని ముద్రగడ చెప్పినట్టుగా చెవులు కొరుక్కుంటున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో ఉభయగోదావరి జిల్లాల వైసీపీ రీజినల్ కోఆర్డినేటర్ రాయబారం నడుపుతున్నట్టు తెలుస్తోంది.జనసేనాని పవన్ కల్యాణ్ వచ్చే ఎన్నికల్లో పిఠాపురంలో పోటీ చేస్తారనే ప్రచారం ఉంది. దానికి తగ్గట్టుగానే వైసీపీ పెద్దలు లెక్కలు వేస్తున్నారట. పవన్ పిఠాపురాన్ని ఎంచుకుంటే..ఆయనపై ముద్రగడను పోటీ చేయిస్తే ఎలా ఉంటుందనే ఆలోచనా ఉందట. గెలుపోటములు ఎలా ఉన్నా.. పిఠాపురంలో సేనానికి టఫ్ ఫైట్ ఇస్తే మిగతా చోట్లా ఆ ప్రభావం పడుతుందనే అంచనాలు ఉన్నాయట. కాకినాడ పార్లమెంట్ పరిధిని కాపు సామాజికవర్గం ఓటర్లు ప్రభావితం చేస్తారు. ఆ సమీకరణాలకు తగ్గట్టుగానే అధికారపార్టీ అడుగులు వేస్తోందట. పిఠాపురం కాకపోతే మరో ఆప్షన్‌గా పెద్దాపురంను కూడా వైసీపీ పరిశీలిస్తోందట. వైసీపీ ఇంత వరకు పెద్దాపురంలో బోణీ కొట్టలేదు. పిఠాపురం, పెద్దాపురం విషయంలో అభ్యంతరాలు వ్యక్తం కాకపోవడంతో.. అడుగులు ముందుకు పడొచ్చని అనుకుంటున్నారు. అయితే ప్రత్తిపాడు సీటును తన ఫ్యామిలీకి వదిలేయాలని ప్రతిపాదన ముద్రగడ నుంచి వెళ్లినట్టు టాక్. దానిపై వైసీపీ పెద్దలు మల్లగుల్లాలు పడుతున్నట్టు చెబుతున్నారు.ఒకే పార్లమెంట్ పరిధిలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరికి సీట్లు ఇవ్వడం వల్ల ఎలాంటి ఫలితం వస్తుందో ఆరా తీసే పనిలో పడ్డారట. రెండుచోట్లా పోటీ చేస్తే ఎక్కడా పూర్తిస్థాయిలో ఎఫెక్ట్ పెట్టే అవకాశం ఉండబోదనే అభిప్రాయం వ్యక్తం అవుతోందట. ఫస్ట్ మీరు కానీయండి.. పార్టీ అధికారంలోకి వచ్చాక నామినేటెడ్ పదవితో ఆ గ్యాప్ పూరుస్తామని ముద్రగడకు ఓపెన్ ఆఫర్ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. పెద్దాయన మాత్రం అది సెట్ చేస్తేనే ఇది సెట్ అవుతుందని స్పష్టం చేశారనే వాదన ఉంది. ఈ ఎపిసోడ్‌ను కొలిక్కి తెచ్చేందుకు పెద్దాపురం, పిఠాపురం, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో వైసీపీ అంతర్గత సర్వేలు చేయిస్తోందట. బరిలో ఎవరు ఉంటే వర్కవుట్ అవుతుంది? పార్టీ ప్రభావం ఏ మేర ఉంటుంది? వ్యక్తిగత మైలేజ్ ఏ మాత్రం కలిసి వస్తుంది అనే వివరాలు సేకరిస్తున్నారట. ఆ సర్వేలో వచ్చిన ఫలితం ఆధారంగా నిర్ణయం తీసుకుంటారని చెబుతున్నారు.తుని రైలు దహనం కేసులో ముద్రగడ కోర్టు వాయిదాల కోసం విజయవాడ వెళ్తున్నారు. ఆ సమయంలోనూ కొందరు వైసీపీ నేతలతో ఆయన టచ్‌లో ఉంటున్నారట. ఇంకోవైపు.. ముద్రగడ ఎటువంటి రాజకీయ నిర్ణయం తీసుకోకపోవడంతో ఆయన అనుచరుల్లో చాలా మంది టీడీపీలోకి వెళ్లిపోయారు. వారిని వెనక్కి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారట. గతంలో ముద్రగడను బీజేపీ పెద్దలు కలిశారు. పదవులు సైతం పందేరం వేశారని అప్పట్లో ప్రచారం జరిగింది. ఎలాగూ జనసేనలోకి వెళ్లడం ఇష్టం లేనందున.. ఆ పార్టీతో పొత్తులో ఉన్న బీజేపీలోకి వెళ్తే.. అటు సామాజికవర్గ పరంగా.. ఇటు పదవుల పరంగా పెద్దగా ఇబ్బంది ఉండదు కదా అని.. పెద్దాయనకు చెబితే.. తనకు ఆ ఆలోచన లేదని నవ్వి ఊరుకున్నారట. మరి.. అధికార వైసీపీ తాజాగా ఇచ్చిన ఆఫర్లపై ముద్రగడ ఎలా స్పందిస్తారో? ఏం చేస్తారో చూడాలి.

# షర్మిల ఇష్యూ

### జగన్ ను తలంటిన గులాబీ నేతలు

విజయవాడ, డిసెంబర్ 2, తెలంగాణలో ఓ వైపు టీఆర్ఎస్ వర్సెస్ బీజేపీ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తున్న విషయం తెలిసిందే. అలాగే రాష్ట్రంలో ఈడీ, సిబిఐ, ఐటీ దాడులతో టీఆర్ఎస్‌లో టెన్షన్ మొదలైంది. అటు ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కవిత పేరు వచ్చింది..రిపోర్టులో కూడా ఆమె పేరు ఉంది. దీంతో రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. అదే సమయంలో గత మూడు రోజులుగా టీఆర్ఎస్ వర్సెస్ షర్మిల అన్నట్లు రాజకీయ యుద్ధం నడుస్తోంది.ఇదే క్రమంలో కవిత, షర్మిల మధ్య ట్వీట్ వార్ కూడా నడిచింది. అయితే షర్మిలపై వరుసపెట్టి టీఆర్ఎస్ నేతలు విరుచుకుపడుతున్నారు. కాకపోతే షర్మిల..కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తుంటే..టీఆర్ఎస్ నేతలు ఏమో జగన్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. తాజాగా గవర్నర్ తమిళిసై తో భేటీ అయిన షర్మిల? పోలీసుల తీరుపై ఫిర్యాదు చేశారు. పోలీసులే నర్సంపేట పాదయాత్రలో విధ్వంసం సృష్టించారని ఆరోపించారు. ప్రభుత్వ సర్వేల్లో వైఎస్సార్టీపీకి ఆదరణ పెరిగిందని తేలిందన్నారు.అలాగే చెప్పుతో కొడుతా అని కేవలం ఒక మంత్రిని మాత్రమే అన్నానని చెప్పుకొచ్చారు. ఇక తాను ఏపీ నుంచి వచ్చానని అంటున్నారు..మరి కేటీఆర్ భార్య ఎక్కడి నుంచి వచ్చారు.. ఆంధ్రా నుంచి కాదా?. విడాకులు తీసుకోమని వేం అడుగుతున్నామా?. తాను ఇక్కడే చదివా.. ఇక్కడే పెళ్లి చేసుకున్నా.. ఇక్కడే కొడుకుని కన్నా.. నా గతం.. వర్తమానం.. భవిష్యత్ అంతా ఇక్కడే అని అన్నారు.ఇక షర్మిల వ్యాఖ్యలపై టీఆర్ఎస్ విరుచుకుపడుతుంది. ఇప్పటికే తెలంగాణ ఆలస్యం అవ్వడానికి వైఎస్సార్ కారణమని టీఆర్ఎస్ మంత్రులు విమర్శించారు. ఇప్పుడు షర్మిల బదులు జగన్‌ని తగులుకుని విరుచుకుపడుతున్నారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి తెలంగాణకు పచ్చి వ్యతిరేకి అని వినోద్ కుమార్ తెలిపారు. బీజేపీ వదిలిన కార్యకర్త షర్మిల. అమిత్ షాతో మాట్లాడిన తర్వాత పాదయాత్ర చేస్తున్నారని అన్నారు.తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం అడ్డుపడి నిధులు విడుదల చేయకపోతే ఒక్కరోజైనా అడిగావా? తెలంగాణలో ఒక్క క్షణమైనా కరెంట్ పోయిందా..? అదే మీ అన్న పాలనలో కరెంట్ పరిస్థితి ఏంటి? ఏపీకి వెళ్లి పాదయాత్ర చేసుకోండి. జగన్, షర్మిల ఒక్కటా?.. లేదంటే వేరా? అర్థంకాని పరిస్థితి" అని కామెంట్ చేశారు. ఇలా షర్మిల బదులు జగన్‌ని గులాబీ నేతలు టార్గెట్ చేస్తున్నారు

# సీఎం, సీఎస్, డీజీపీ... అందరూ కడపే

కడప, డిసెంబర్2,కడప పేరు ఇప్పుడు ఏపీలో మార్మోగిపోతుంది. వెనకబడిన ప్రాంతంగా భావించే కడప ఇప్పుడు ఏపీలో అన్నింటా ముందుందనే చెప్పాలి. ఆంధ్రప్రదేశ్ పాలన మొత్తం కడప వారి చేతుల్లోనే ఉంది. ఆంధ్రప్రదేశ్ లో ఎప్పుడూ లేని పరిస్థితి కనపడుతుంది. పరిపాలనలో ముఖ్యులు ముగ్గురు కడప జిల్లాకు చెందిన వారే. ముగ్గురు ఒకే సామాజికవర్గానికి చెందిన వారు కావడం విశేషం. గతంలో ఎన్నడూ ఇలా చోటు చేసుకోలేదు. నిర్ణయాధికారం, అమలు అంతా కడపకు చెందిన వారే కావడం గమనార్హం.. తాజాగా చీఫ్ సెక్రటరీ నియామకంతో ముగ్గురు కీలక వ్యక్తులు కడపకు చెందిన వారుగా భావించవచ్చు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంగతి తెలిసిందే. ఆయన కడప జిల్లాకు చెందిన వారు. తొలి సారి ముఖ్యమంత్రి అయినా సంక్షేమ పథకాలను విస్తృతంగా అమలు చేస్తూ ప్రజల్లోకి వెళుతున్నారు. యువకుడే అయినా ఆయన అనుభవమున్న రాజకీయ నేతగా మారిపోయారు. జైలు జీవితం, పాదయాత్ర వంటి వాటివి ఆయనకు పాఠాలు నేర్పి ఉండవచ్చు. అందుకే జగన్ చిన్న వయసులోనే ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలను స్వీకరించి విభజన ఆంధ్రప్రదేశ్ ను పాలిస్తున్నారు... ఇక రాష్ట్రంలో శాంతి భద్రతలను పర్యవేక్షించే అత్యున్నత స్థాయి పదవిలో ఉన్న డీజీపీ కసిరెడ్డి రాజేంద్ర నాథ్ రెడ్డి. ఆయన కూడా కడప జిల్లాకు చెందిన వారే. 1992 బ్యాచ్ కు చెందిన రాజేంద్రనాథ్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో పలు కీలక పోస్టులను నిర్వహించారు. కడప జిల్లాలోని రాజుపాలెం మండలం వర్లపాడు గ్రామానికి చెందిన రాజేంద్ర నాథ్ రెడ్డిని ముఖ్యమంత్రి జగన్ డీజీపీగా నియమించారు. 1960లో జన్మించిన రాజేంద్ర నాథ్ రెడ్డికి అనేక విభాగాల్లో పనిచేసిన అనుభవం ఉంది. ఆయనకు మంచి పేరు కూడా ఉంది. దీంతో జగన్ ఆయనను డీజీపీగా నియమించారు.కేఎస్ జవహర్ తాజాగా చీఫ్ సెక్రటరీ గా నియమితులైన కేఎస్ జవహర్ రెడ్డిది కూడా కడప జిల్లానే. 1990 బ్యాచ్ కు చెందిన జవహర్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ అనేక శాఖల్లో పనిచేసి సమర్థమైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో గా కూడా ఆయన పనిచేశారు. సీనియర్లున్నా ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలతో పాటు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న తమకు అండగా ఉండాలని జగన్ జవహర్ రెడ్డిని ఎంచుకున్నారు. ఆయన కడప జిల్లా కొండాపురంకు చెందిన వ్యక్తి. దీంతో ఏపీలో ముగ్గురు కీలకమైన పదవుల్లో ఉన్నవారు కడప జిల్లాకు చెందిన వారే కావడం విశేషం. గతంలో ఎన్నడూ ఇలా జరగలేదన్నది రాజకీయ విశ్లేషకులు సయితం అంగీకరిస్తున్న విషయం. అయితే ఇందులో ఎవరినీ తప్పు పట్టడానికి లేదు. ముగ్గురు కష్టపడి పైకి వచ్చిన వాళ్లే. ముగ్గురు పనితీరు ఆధారంగానే పదవులు దక్కాయన్న వాదన లేకపోలేదు.

# మళ్లీ బంగారం తాపడం పనులు

### 65 ఏళ్ల తర్వాత తొలిసారి

తిరుమల, డిసెంబర్ 2, పాలక మండలి సమావేశంలో కీలక నిర్ణయం తీసుకుంది టీటీడీ. తిరుమల శ్రీవారి ఆలయ ఆనంద నిలయం బంగారు తాపడం పనుల కోసం ఫిబ్రవరి 23 నుంచి బాలాలయ నిర్మాణం ప్రారంభిస్తామని ప్రకటించింది. 6 నెలల్లో తాపడం పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని చెప్పారు టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి. ఈ సమయంలో శ్రీవారి దర్శనం కొనసాగుతుందని ప్రకటించారు. తాపడం పనుల కోసం భక్తులు సమర్పించిన బంగారాన్ని వినియోగిస్తామన్నారు. బంగారు తాపడం పనుల కోసం 1957-58 సంవత్సరంలో టీటీడీ అనుసరించిన విధానాన్నే అనుసరిస్తామని తెలియజేశారు. పాలక మండలి సమావేశం టీటీడీ చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి అధ్యక్షతన తిరుమల అన్నమయ్య భవనంలో జరిగింది. హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మత్స్యకార ప్రాంతాల్లో మొదటి విడతలో 502 ఆలయాలు నిర్మించామని చెప్పారు వైవీ.సుబ్బారెడ్డి. రెండో విడతలో శ్రీవాణి ట్రస్టు నిధులతో దశలవారీగా ఆలయాల నిర్మాణం చేపడతామన్నారు. ఈ ఆలయాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు సమరసత సేవ ఫౌండేషన్‌తోపాటు దేవాదాయశాఖ ద్వారా, ఆయా జిల్లా యంత్రాంగాల ద్వారా నిర్మించేందుకు చర్యలు చేపడతామన్నారు. నేటి నుంచి తిరుమల శ్రీవారి ఆలయంలో ఉదయం 7.30 నుండి 8 గంటల మధ్య బ్రేక్ దర్శనం ఇస్తున్నారు. ఒక నెలపాటు ప్రయోగాత్మకంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. తిరుపతి లోని మాధవంలో శ్రీవాణి ఆఫ్ లైన్ టికెట్లు, గదులు కేటాయించడం జరుగుతుందన్నారు.జనవరి 2న వైకుంఠ ఏకాదశి పర్వదినానికి సంబంధించి గతంలో అనుసరించిన విధానాన్ని కొనసాగిస్తామన్నారు. పది రోజులపాటు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తామనీ, ఇందుకోసం రోజుకు 25 వేలు చొప్పున 2.50 లక్షల ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఆన్లైన్ లో విడుదల చేస్తామని ప్రకటించారు. అదేవిధంగా రోజుకు 50,000 చొప్పున 5 లక్షల సర్వదర్శనం టైం స్లాట్ టోకెన్లు తిరుపతిలో కౌంటర్ల ద్వారా మంజూరు చేస్తామన్నారు. దర్శన టికెట్ ఉన్నవారిని మాత్రమే ఆలయంలో దర్శనానికి అనుమతించడం జరుగుతుందనీ, దర్శన టికెట్ లేనివారు తిరుమలకు రావచ్చుగానీ దర్శనానికి అనుమతించబడరని చెప్పారు. అలిపిరి వద్ద స్పిరిచువల్ సిటీ నిర్మాణ పనులకు డిజైన్లు ఖరారు చేశామన్నారు. త్వరలో మొదటి దశ టెండర్లను పిలవడం జరుగుతుందని పేర్కొన్నారు.టీటీడీలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, కార్పొరేషన్ ఉద్యోగులకు వేతనాల పెంపునకు సంబంధించి అధ్యయనం చేసేందుకు ఈఓ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేశామని చెప్పారు. వచ్చే బోర్డు సమావేశంలో ప్రతిపాదనలు సమర్పిస్తారనీ, భక్తుల సౌకర్యార్థం తిరుమలలోని నందకం విశ్రాంతి గృహంలో మంచాలు తదితర ఫర్నీచర్ కొనుగోలుకు రూ.2.95 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. తిరుమల రెండో ఘాట్ రోడ్డులో రక్షణ గోడ నిర్మాణానికి రూ.9.05 కోట్లతో టెండరుకు ఆమోదం తెలిపారన్నారు. తిరుమల బాలాజి నగర్ ప్రాంతంలో అంతర్గత రోడ్లు, పార్కింగ్ ప్రదేశం, మురుగుకాల్వల నిర్మాణానికి రూ.3.70 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటించారు. తిరుమల శ్రీ పద్మావతి విశ్రాంతిగృహం వద్ద గదుల ఆధునీకరణ ఇతర అభివృద్ధి పనుల కోసం రూ.3.80 కోట్లు కేటాయించామన్నారు.ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన 12 రకాల ఉత్పత్తులను రాష్ట్ర రైతు సాధికార సంస్థ సహకారంతో ఎపి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుకు ఆమోదం తెలిపింది టీటీడీ పాలక మండలి. అంతే కాకుండా జమ్మూలో నిర్మాణంలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో పలు అభివృద్ధి పనులు, వసతులు కల్పించేందుకు గాను 10 రకాల పనులను రూ.7 కోట్లతో చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రిలో బాలుర హాస్టల్ భవనంలో అదనపు అంతస్తు నిర్మాణానికి రూ.3.35 కోట్లు మంజూరు చేసింది. టీటీడీ ఆసుపత్రులు, డిస్పెన్సరీలకు గాను మందుల కొనుగోలుకు రూ.2.56 కోట్లు, సర్జికల్ సామగ్రి కొనుగోలుకు రూ.36 లక్షలు మంజూరు చేసింది. తిరుపతిలోని శ్రీ తాతయ్యగుంట గంగమ్మ ఆలయ అభివృద్ధి పనుల కోసం రూ.3.75 కోట్లు కేటాయించింది. టిటిడిలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 2022 శ్రీవారి బ్రహ్మోత్సవ బహుమానం చెల్లింపునకు ఆమోదం తెలిపింది. టిటిడిలో 7 వేల మంది రెగ్యులర్, 14 వేల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. రెగ్యులర్ ఉద్యోగులకు ? 14వేలు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ? 6850/ బ్రహ్మోత్సవ బహుమానం ఇవ్వనుంది టీటీడీ.

# శాసనమండలి ఎన్నికల్లో అక్రమాలు అరికట్టాలి

### - సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్ డిమాండ్.



బద్వేలు. బద్వేల్ సుందరయ్య భవనంలో పి.చాంద్బాషా అధ్యక్షతన" శుక్రవారం ప్రజా సంఘాల ఐక్యవేదిక" సమావేశం నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ... రానున్న శాసనమండలి ఎన్నికల్లో ఓట్ల నమోదులో అధికార వైసీపీ ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తూ, అక్రమాలకు పాల్పడుతున్నదని, నకిలీ ఓట్లు చేర్పించినట్లు అనేక ఆధారాలు బట్టబయలయ్యాయని, ప్రతి జిల్లా కు ఒక ప్రత్యేక ఐఏఎస్ అధికారిని నియమించి ఓట్లను స్కూటినీ చేయించాలని ఎన్నికల సంఘాన్ని మేము డిమాండ్ చేస్తున్నామన్నారు. సచివాలయ వాలంటీర్ల వినియోగాన్ని నిరోధించాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉపాధ్యాయులపై వేధింపులు, బెదిరింపులు ఆపాలని, స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఎన్నికలు జరిగే విధంగా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ బద్వేల్ పట్టణ కార్యదర్శి అన్వర్ భాష, వ్యవసాయ కార్మిక సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు డి.వెంకటేష్, మహిళా సంఘం ఐద్వా బద్వేల్ పట్టణ అధ్యక్షురాలు అనంతమ్మ, కార్యదర్శి మేడ గౌతమి, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# నేడు అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం డిసెంబరు 3వ తేదీన నిర్వహిస్తారు. రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరంగా వికలాంగులు ఎదుగుదలను ప్రోత్సహించేలా ఈ దినోత్సవం ప్రయత్నిస్తుంది. వికలాంగుల సమస్యలను పరిష్కరించి వారికి ఆసరానిచ్చి, వారు గౌరవంగా జీవిస్తూ సాధారణ జనజీవనంలో భాగమై అన్ని హక్కులు పొందేలా చూడడంకోసం 1992లో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ఈ దినోత్సవం మొదలై,1998 నుండి ప్రతి సంవత్సరం వికాలాంగులకు సంబంధించిన ఒక అంశంతో అన్ని దేశాలు ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాయి. వికలాంగులకు సమాన అవకాశాలు, హక్కులు కలిపించి వారందరిని సమాజ అభివృద్ధిలో భాగం చేయాలనే లక్ష్యంతో 1976లో ఐక్యరాజ్య సమితి 1981 సంవత్సరాన్ని అంతర్జాతీయ వికలాంగుల సంవత్సరం గా ప్రకటించింది. అలాగే 1983 నుండి 1992 వరకు ఐక్యరాజ్య సమితి వికలాంగుల దశాబ్దంగా ప్రకటించింది. ఈ దినోత్సవం రోజున ప్రపంచవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడుతాయి. కాలిబర్, వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్లు వంటివి బహుకరిస్తారు. వివిధ పాఠశాలలోని వికలాంగ విద్యార్థులకు పిల్లలకు ప్లేట్లు, టిఫిన్ బాక్సులు, వాటర్ బాటిళ్లు... భవిత కేంద్రంలోని చిన్నారులకు బిస్కెట్లు, క్రీడా సామగ్రిని అందజేస్తారు.వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందిస్తారు.




# 3 సం పాలనలో ఇదేం కర్మ ప్రజలు అనడం తప్ప అభివృద్ధి ఏమి లేదు జిల్లా ఉపాధ్యక్షుడు చెన్న బసప్ప



కౌతాళం : 3సం వైస్సార్ పాలన ఇదేం కర్మ ప్రజలు అనడం తప్ప అభివృద్ధి ఒరిగింది ఏమి లేదని జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప, జిల్లా రైతు సంఘము ఉపాధ్యక్షుడు వెంకటపతి రాజు పేర్కొన్నారు.తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి"అనే కార్యక్రమం×మంత్రాలయం నియోజకవర్గం ఇన్చార్జి పాలకుర్తి తిక్కరెడ్డి ఆదేశాలు మేరకు ప్రారంభించడం జరిగిందిక్లస్టర్ ఇంచార్జ్ అల్లూరి వెంకటపతి రాజు ఆధ్వరంలోకౌతాళం మండలంలోని ఎరిగేరి గ్రామంలో శ్రీ పులిగట్టు ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి ప్రోగ్రాం పోస్టర్లు విడుదల చేసి క్లస్టర్లోని గ్రామాలు కౌతాళం,ఎరిగేరి,తోవి, బదినెహాల్, కుంటానహాల్, ఉప్పరహాల్, రౌడూరు, గ్రామాల యూనిట్,బూత్ ఇంచార్జిలకు ఇదేం ఖర్మ ప్రోగ్రాం మెటీరియల్ అందజేసి ఎరిగేరి గ్రామంలో ఇదేంకర్మ- మన రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రాలయం నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప క్లస్టర్ ఇంచార్జి తెలుగురైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకటపతి రాజు ఎరిగేరి గ్రామంలో ఇంటి ఇంటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైయస్సార్ ప్రభుత్వం వైఫల్యాలు వివరిస్తూ ప్రజలు సమస్య తెలుసుకుంటు రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుంది ప్రజలు కోసం పని చేసే పార్టీ తెలుగు దేశం పార్టీ అని వైయస్సార్ పార్టీ చేసింది ఏమి లేదు అని ప్రజలకు వివరించారు ప్రజలను పలకరిస్తూ వైయస్సార్ ప్రభుత్వం మోసాలు తప్ప అభివృద్ధి చేసింది ఏమి లేదు అని ప్రజలుకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కురువ వీరేష్,డా.రాజానంద్,ఎరిగేరి బసవరాజు,రాజబాబు, దొడ్డన గౌడ్,వెంకటేష్ గౌడ్,మైనారిటీసంఘం జిల్లా కార్యదర్శి రహిమాన్, తిప్పలదొడ్డి రామాంజి,ఉమేష్ గౌడ్,అన్ని గ్రామాల యూనిట్, బూత్ ఇంచార్జిలు మరియు ఐ.టిడిపి బృందం మంజునాథ, ఏసి వీరేష్ గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### బయట పడిన 16 వ శతాబ్దపు జాంబవంతుని శాసనం

సిద్ధవటం డిసెంబర్ 02: కడప జిల్లాలోని అతి పురాతన ప్రాంతమైన సిద్ధవటం మండలానికి పడమర దిక్కున 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న జ్యోతి గ్రామంలో 16 శతాబ్దం నాటి జాంబవంతుని శాసనం బయట పడింది.భూమి లో మూడు అడుగుల లోతులో ఉన్న ఈ శాసనాన్ని ఆ గ్రామ



పెద్దలు వెలికి తీసి ప్రతిష్టించారు సీనియర్ పాత్రికేయులు, దక్షిణ భారత పర్యాటక సంస్థ ప్రధాన కార్యదర్శి జ్యోతి జార్జి ఈ జాంబవంతుని శాసనం ఫోటోను వైనూర్ లోని శాస్త్ర పరిశోధకులు ఆచార్య మునిరత్నం రెడ్డికి పంపించగా ఆయన పరిశీలించి ఇది తెలుగు భాష లో చెక్క బడి ఉందని 16 వ శతాబ్ద ఈ సీ నాటి అక్షరాలలో వ్రాయబడి ఉందని చెప్పారు ఈ (హనుమంతుని ప్రతిమ)ను స్థానిక ప్రజలు జాంబవంతుడని పిలుస్తారని చెప్పారు రెడ్డిలు,కరణములు (విలేజ్ (అకౌంటెంట్లు) గ్రామం లోని నరగడ్డ వద్ద ఉన్న భూములను బహుమతి గా ఇచ్చినట్లు రికార్డు చేసినట్లు తెలుస్తోందని చెప్పారు అనంతరం జర్నలిస్టు జ్యోతి జార్జి మాట్లాడుతూ ఇలాంటి పురాతన చరిత్ర ను ఆనవాళ్లు ను రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు ప్రభుత్వం ఇక్కడ ఒక దేవాలయం నిర్మించి సంరక్షణ కోసం గ్రామంలో ఉన్న వ్యక్తిని నియమించాలని కోరారు

# శాసనమండలి ఎన్నికల్లో అక్రమాలు అరికట్టాలి

### : జిల్లా ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్

కడప సిటి రానున్న శాసనమండలి ఎన్నికల్లో ఓట్ల నమోదులో అధికార వైసీపీ ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తూ, అక్రమాలకు పాల్పడుతున్నదని, నకిలీ ఓట్లు చేర్పించినట్లు అనేక ఆధారాలు బట్టబయలయ్యాయని, ప్రతి జిల్లా కు ఒక ప్రత్యేక ఐఏఎస్ అధికారిని నియమించి ఓట్లను స్కూటినీ చేయించాలని ఎన్నికల సంఘాన్ని మేము డిమాండ్ చేస్తున్నామ న్నారు. సచివాలయ వాలంటీర్ల వినియోగాన్ని నిరోధించాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉపాధ్యాయు లపై వేధింపులు, బెదిరింపులు ఆపాలని, స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఎన్నికలు జరిగే విధంగా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ బద్వేల్ పట్టణ కార్యదర్శి అన్వర్ భాష, వ్యవసాయ కార్మిక సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు డి.వెంకటేష్, మహిళా సంఘం ఐద్వా బద్వేల్ పట్టణ అధ్యక్షురాలు అనంతమ్మ, కార్యదర్శి మేడ గౌతమి, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు



# విద్యార్థుల కోర్కెలు తీర్చని జగనన్న విద్యా దీవెన.



బద్వేలు జగనన్న విద్యా దీవెనకు గౌరవేతనం దక్కాలంటే కడప ఉక్కు పరిశ్రమతోనే సాధ్యం.జగనన్న విద్యా దీవెన పొందే విద్యార్థులకు ఉపాధి అవకాశాలు రావాలంటే కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా బద్వేల్ ఏరియా కార్యదర్శి.అశోక్ మాట్లాడుతూ..!విద్యార్థులు ఉన్నత చదువుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అందించాల్సిన ఫీజు రీయింబర్స్మెంట్ను రాజకీయ రంగును పులుముకొని జగనన్న విద్యా దీవెన చేసినప్పటికీ విద్యార్థుల కోరికలకు సమతుల్యత లేదన్నారు. ఈ రాష్ట్రంలో విద్యా దీవెన పై ఆధారపడి చదువుతున్న విద్యార్థులకు భవిష్యత్తు మార్గదర్శకానికి ముళ్ళ కంపల ఈ రాష్ట్ర ప్రభుత్వం తయారయింది అన్నారు. విద్యారంగానికి ఉపాధిని చేరువ చేయాలంటే కడప ఉక్కు పరిశ్రమతోనే సాధ్యమన్నారు. సంవత్సరానికి ఒకే విడతగా అందించాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ను జగనన్న విద్యా దీవేన, జగనన్న వసతి దీవెన, గా పేరు మార్చి నాలుగు విడతలుగా అందిస్తామని సకాలంలో అందించకపోవడంతో విద్యార్థులు, కళాశాల యాజమాన్యాలు తీవ్రగ్భ్రాంతులకు గురవుతున్నారన్నారు. పేద, బలహీన, బలహీన, వర్గ విద్యార్థుల ఉన్నత చదువుల కోసం, అనంతరం వచ్చే ఉద్యోగాల కోసం తీసుకొచ్చామని చెప్పిన జగనన్న విద్యా దీవెన ఈరోజు విద్యార్థుల పాలిట శాపంగా మారిందిన్నారు. పరీక్షల సమయానికి విద్యా దీవెన అందకపోవడంతో కళాశాల యాజమాన్యాలు హాల్ టికెట్లను అడ్డం పెట్టుకొని వేధింపులకు గురి చేస్తున్నారని విద్యార్థులు తీవ్రంగా ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న విద్యా దీవెన పథకం విద్యార్థి ఉన్నత చదువులకు తగ్గట్టుగా వచ్చే ఉద్యోగాలకు దోహదపడుతుందని విద్యార్థిని తల్లిదండ్రులు భావించారని వారి ఆశలను నీరు కార్చే విధంగా ఈరోజు రాష్ట్ర ప్రభుత్వం వవరిస్తుందన్నారు. ఉన్నత చదువులు చదివిన విద్యార్థుల సర్టిఫికెట్లు ఈ రోజుల్లో కేవలం బజ్జీల పొట్లాలకు మాత్రమే పరిమితం అవుతున్నాయని, ఉద్యోగం అనే మాటే రాష్ట్ర ప్రభుత్వం నోటా వినపడకపోవడం ఎంతో సిగ్గుచేటు అన్నారు. రాయలసీమ విద్యార్థులు చదివిన ఉన్నత చదువులకు తగ్గ ఉద్యోగాలు, పరిశ్రమలు లేక ఇతర రాష్ట్రాలకు, గల్ఫ్ దేశాలకు వలసలు పోవలసిన దుస్థితి నెలకొందన్నారు. ఏదైతే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన జగనన్న విద్యా దీవెన పథకానికి న్యాయం చేయాలన్నా ,విద్యార్థులకు ఉద్యోగాలు రావాలన్నా కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ నిర్మాణంతోనే సాధ్యమన్నారు. విద్యార్థుల పట్ల ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా రాయలసీమ జిల్లాల్లో లక్ష ఉద్యోగాలకు దిక్సూచి అయిన కడప ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని అందుకు ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి నేడు 2,3 తేదీన పులివెందుల పర్యటనలో స్పష్టత ఇవ్వాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు.లేనిపక్షంలో32 మంది విద్యార్థుల బలిదానంతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఉద్యమ చరిత్రను పునరుద్ధరణ చేస్తామన్నారు.పెద్ద ఎత్తున విద్యార్థి లోకాన్ని తరలించి ఈ జిల్లాలో కడప ఉక్కు పరిశ్రమకు మీరు వేసిన శిలాఫలకాన్నే ఈ జిల్లా వైయస్సార్సీపీ పార్టీకి సమాధి రాయిగా మారుస్తామని విద్యార్థి లోకం తరపున హెచ్చరిక చేశారు.

# తాసిల్దార్ పై బ్లాక్ మెయిల్ చేయడం సరైన పద్ధతి కాదు..

**కలెక్టర్ ఆదేశాలను బేకాతర్ చేసిన విఆర్ఓ పై చర్యలు తీసుకోవాలి**

**ప్రజాసంఘాలు,వీఆర్వో అసోసియేషన్ పేరుతో 14 ఏళ్లు ఒకే చోట తిష్ట వీఆర్వోలను మభ్యపెట్టిన మౌళి భాష,**

నందికొట్కూర్ డిసెంబర్ 2 )నందికొట్కూర్, తాసిల్దారు కార్యాలయం పరిధిలో బ్రాహ్మణ కొట్టుకూరు వీఆర్వోగా పనిచేస్తున్న మౌళి భాష విఆర్ఓ అసోసియేషన్ అధ్యక్షులుగా ఉంటూ ఒకే చోట 14 సంవత్సరాలు వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న వలన నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామున్ బ్రాహ్మణ కొట్టుకూరు నుండి బిజినవేముల గ్రామానికి బదిలీ చేయడం జరిగిందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి వెంకటేశ్వర్లు.వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి పకీర్ సాహెబ్. సిఐటియు నాయకులు ఎస్ ఉస్మాన్ భాష. మహిళా సంఘం మండల కార్యదర్శి నూర్జహాన్ అన్నారు, శుక్రవారం ,స్థానిక సుందరయ్య భవనంలో ప్రజా సంఘాల సమావేశం జరిగింది ,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వీఆర్వో సంఘం పేరుతో ఒకే స్థానంలో 9 సంవత్సరాలు పనిచేసేందుకు ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు ,దీనిని అతిక్రమించి 14 సంవత్సరములు ఒకే చోట పనిచేసినందుకు జిల్లా కలెక్టర్ బదిలీ చేశారన్నారు, బిజినవేముల లో రెండు నెలలు విధులకు హాజరు కాకుండా తాసిల్దార్ రాజశేఖర్ బాబు తనకు రెండు నెలల జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేయడంతోనే సమస్య మొదలైన అన్నారు, జిల్లా కలెక్టర్ ఆదేశాలు బెగతార్ చేసి నిధులకు హాజరుకాకుండా జీతాలు ఇవ్వాలని తాసిల్దారును బ్లాక్ మెయిల్ చేయడం సరైనది కాదన్నారు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా బ్రాహ్మణ కొట్కూరు బదిలీపై వెళ్లిన వీఆర్వో నర్సరాజు కు బిజినవేములకు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించడం జరిగిందన్నారు,

# రాంపల్లి గ్రామంలో "ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి" కార్యక్రమం నిర్వహణ



తుగ్గలి: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు నియోజకవర్గం ఇంచార్జ్ కెయి శ్యాంబాబు ఆదేశాల మేరకు శుక్రవారం రోజున మండల పరిధిలోని గల రాంపల్లి గ్రామం నందు మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు ఆధ్వర్యంలో "ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి" అనే కార్యక్రమాన్ని ఇంటింటికి తిరిగి ప్రారంభించారు.గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రజల నుండి ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా నాయకులు ప్రజలతో మాట్లాడుతూ కొత్త కొత్త నిబంధనలను ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులను దూరం చేస్తుందని ప్రజలకు వారు వివరించారు.అర్హత కలిగి ఉన్నా కూడా ప్రభుత్వ పథకాలు చాలా మందికి అందడం లేదని తెలుగుదేశం పార్టీ నాయకులు తెలియజేశారు.అదేవిధంగా గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ హేమాద్రి నాయుడు,బూత్ కన్వీనర్లు రామానాయుడు,కృష్ణగోపాల్ నాయుడు,వెంకటేష్,శీను తదితరులు పాల్గొన్నారు.

# అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడం ఎన్నికల యంత్రాంగం బాధ్యత



**: ఎలక్షన్ సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ప్రతి డిగ్రీ మరియు ఇంజనీరింగ్ కాలేజీలలో ఓటరు నమోదు పై ప్రత్యేక దృష్టి సారించాలని**

**: జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వర రావు**

కర్నూలు, డిసెంబరు, 01 : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడమే ఎన్నికల యంత్రాంగం బాధ్యత అని ఎలక్షన్ సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ అన్ని జిల్లా కలెక్టర్లకు సూచించారు. గురువారం ఎలక్షన్ కమిషన్ ద్వారా స్పెషల్ సమ్మరీ రివిజన్ లో భాగంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టరేట్ లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హల్ నుంచి పాల్గొన్న జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి, కర్నూలు నగర పాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తదతరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎలక్షన్ సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ మాట్లాడుతూ స్పెషల్ సమ్మరీ రివిజన్ లో భాగంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై కలెక్టర్లు క్షేత్రస్థాయిలో మరియు పోలింగ్ స్టేషన్ స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు తదితర కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఫైనల్ ఎలక్ట్రోల్ పబ్లిష్ అయ్యేలోపు మార్పులు చేర్పులు చేపట్టాలని అన్ని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువ ఓటర్లు లేని పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈఆర్ఓ లను ఆదేశించారు. ప్రతి మండలంలోని డిగ్రీ మరియు ఇంజనీరింగ్ కాలేజీలలో చదువుకుంటున్న యువత నుంచి ఫామ్ 6 ద్వారా ఓటర్ నమోదు కార్యక్రమం చేపట్టాలన్నారు. సదరు కాలేజీలకు ఈఆర్ఓ వెళ్లే ముందు ముందస్తు సమాచారం ఇవ్వడం ద్వారా విద్యార్థులను అందుబాటులో ఉంటారన్నారు. పెండింగ్ ఫామ్స్ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఈఆర్ఓలను ఆదేశించారు. ప్రతి శని, ఆది వారాలలో బూత్ స్థాయి సమాచారాన్ని తెప్పించుకోవాలని ఎలక్షన్ సూపరింటెండెంట్ సూచించారు. ముఖ్యంగా మండలాలలో ఈపి రేషియో పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఎలక్షన్ విధివిధానాలపై పాటించవలసిన నియమాలపై జిల్లా కలెక్టర్ ఈఆర్ఓలకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో నాసర రెడ్డి, కర్నూలు ఆర్డిఓ హరిప్రసాద్, ఆదోని ఆర్డీవో మోహన్ దాస్, తాసిల్దార్లు, ఈఆర్ఓ, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఆదిపురుష్.. లెక్క మారితే మరింత ఆలస్యం?

రామాయణం కథ ఆధారంగా సరికొత్త 3ఆ టెక్నాలజీతో ఆదిపురుష్ సినిమాను తెరపైకి తీసుకురావాలని అనుకున్నారు. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ రాముడి పాత్రలో నటిస్తుండగా బ్యూటిఫుల్ హీరోయిన్ కృతి సనన్ సీతమ్మ తల్లి పాత్రలో నటించడానికి ఒప్పుకుంది. ఇక మరో ప్రముఖ బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ భయంకరమైన రావణాసురుడి పాత్రలో కూడా నటించేందుకు ఒప్పుకోవడంతో ఈ సినిమాపై ఒక్కసారిగా అంచనాలు పెరిగిపోయిన విషయం తెలిసిందే.అయితే సినిమా షూటింగ్ అయిపోయిన తర్వాత రెగ్యులర్ ప్రమోషన్ స్టార్ట్ చేయాలనుకున్న చిత్ర యూనిట్ కు చేదు అనుభవం ఎదురయింది. ఒకే ఒక్క టీజర్ విడుదల చేయగా ఊహించని విధంగా సినిమాకు నెగిటివ్ టాక్ వచ్చేసింది.గ్రాఫిక్స్ విషయంలో తీవ్రస్థాయిలో ట్రోలింగ్ జరగడంతో దెబ్బకు చిత్రం యూనిట్ సభ్యులందరూ కూడా మళ్ళీ ఆలోచనలో పడ్డారు. ఇక సినిమాను ఇప్పట్లో విడుదల చేస్తే మంచిది కాదు అని ప్రభాస్ మళ్ళీ దర్శక నిర్మాతలతో మాట్లాడి రీ వర్క్ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశాడు.దీంతో సినిమాను వచ్చే ఏడాది జూన్లో విడుదల చేయాలని ఫిక్స్ అయిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం వినిపిస్తున్న మరొక టాక్ ప్రకారం ఆదిపురుష్ సినిమా ఆ సమయానికి కూడా వస్తుందో లేదో అనే అనుమానాలు వస్తున్నాయి. ఎందుకంటే ప్రస్తుతం ప్లాన్ ప్రకారం గ్రాఫిక్స్ పనులు మరికొంత ఆలస్యం జరిగిన జరగవచ్చని అంతేకాకుండా వెంట వెంటనే ప్రభాస్ సినిమాలు 2023లో విడుదల అయితే కూడా బాగుండదు అనే ఆలోచనతో ఉన్నారు.ఏదేమైనా ప్రస్తుతం టాక్ ప్రకారం అయితే సినిమా వచ్చే ఏడాది సమ్మర్లో వచ్చే అవకాశం లేదు అని తెలుస్తోంది. 2024 లోనే సంక్రాంతికి విడుదల చేయాలని ఆలోచిస్తున్నట్లు మరొక కొత్త టాక్ వినిపిస్తోంది. ఎందుకంటే సినిమాకు తప్పనిసరిగా ఫెస్టివల్ సీజన్ ఉంటేనే ప్రాఫిట్ జోన్ లోకి వస్తుంది అని సినిమాపై నెగెటివిటీ ఎంత ఉన్నా కూడా ఆ టైంలో నష్టాలు వచ్చినా మరి భారీ స్థాయిలో అయితే రావనే ఆలోచనలో ఉన్నట్లు టాక్ వస్తోంది. మరి ఇది ఎంతవరకు నిజమో తెలియాలి అంటే మరి కొంత కాలం ఆగాల్సిందే.






# వారసుడు.. దిల్ రాజు ప్లాన్ 'అదిరింది'




తమిళ హీరో విజయ్ ఇప్పుడు తెలుగులో వారసుడు సినిమాతో ఎలాగైనా సక్సెస్ అందుకోవాలని అనుకుంటున్నాడు. అతను నటించిన సినిమాలు ఇటీవల కాలంలో తెలుగులో డీసెంట్ కలెక్షన్స్ అందుకుంటున్న విషయం తెలిసింది. ముఖ్యంగా మాస్టర్ సినిమా అయితే విజయ్ కు మొదటిసారి తెలుగులో మంచి నెంబర్స్ ఐతే తీసుకొచ్చింది. దీంతో అప్పటినుంచి అతను తెలుగు సినిమా ఇండస్ట్రీపై మరింత ఫోకస్ చేశాడు.అయితే మాస్టర్ తో వచ్చిన క్రేజ్ బీస్ట్ సినిమాకు బిజినెస్ కు బాగానే ఉపయోగపడింది. కానీ ఆ సినిమా నెగిటివ్ ఫలితం అందుకోవడంతో డిస్ట్రిబూటర్స్ కు నష్టాలను కలిగించింది. ఇక ఈసారి ఎలాగైనా వారసుడు సినిమాతో సక్సెస్ అందుకొని తెలుగు మార్కెట్ లో డిమాండ్ పెంచుకోవాలని అనుకుంటున్నాడు. ఈ సినిమాను దిల్ రాజు నిర్మిస్తున్న విషయం తెలిసిందే. తెలుగు దర్శకుడు వంశీ పైడిపల్లి దర్శకత్వం వహించాడు.ఇక తెలుగులో ప్రత్యేకంగా విజయ్ మొదటిసారి ప్రమోషన్స్ కూడా చేయబోతున్నాడు. అయితే ఈ సినిమాపై ప్రమోషన్స్ ప్రణాళికలు కూడా మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఒక సాంగ్ విడుదల చేశారు. అయితే దిల్ రాజు స్ట్రాటజీ చాలా డిఫరెంట్ గా ఉంటుంది అని చెప్పవచ్చు. ఇక తెలుగులో విజయ్ సినిమాలో మంచి రెస్పాన్స్ అందుకున్న వాటిలో అదిరింది ఒకటి. అట్లీ దర్శకత్వంలో వచ్చిన మెర్సల్ సినిమాను తెలుగులో అదిరింది పేరుతో విడుదల చేసి మంచి సక్సెస్ అందుకున్నారు.అయితే ఆ కమర్షియల్ సినిమాను ఇప్పుడు మళ్లీ రీ రిలీజ్ చేయాలని ఫిక్స్ అయ్యారు. డిసెంబర్ 4వ తేదీన ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లోని సుదర్శన్ 35ఓఓ లో సాయంత్రం 6 గంటలకు అదిరింది సినిమా స్పెషల్ షోను ప్రదర్శించబోతున్నారు. ఇక ఇటీవల తెలుగులో విజయ్ కు ఫ్యాన్ ఫాలోవర్స్ పెరిగారు. ఇక ఆ స్పెషల్ షో కోసం ఆ ఫ్యాన్స్ అందరు కూడా రాబోతున్నట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో అదే న్యూస్ వైరల్ గా మారింది. ఈ సినిమాపై పెరిగే బజ్ వారసుడు సినిమాకు ఉపయోగపడుతుంది అని డీకే రాజు కొత్త ప్లాన్ వేసినట్లు అనిపిస్తుంది. మరి ఆ ప్లాన్ ఎంతవరకు వర్కౌట్ అవుతుందో చూడాలి.

# ఐపీఎల్ వేలంలోకి వారిద్దరూ ఎంట్రీ.. రికార్డులు బద్దలు కావాల్సిందే!



ఐపీఎల్-2023 మినీ వేలానికి సమయం అసన్నమవుతోంది. డిసెంబర్ 23న కొచ్చి వేదికగా ఈ మినీ వేలం జరగనుంది. ఈ మినీవేలంలో మొత్తంగా 991 మంది ఆటగాళ్లు తమ పేర్లను నమోదు చేసుకున్నారు.21 మంది తమ బేస్ప్రైజ్ రూ. 2 కోట్లగా నమోదు చేసుకున్నారు. ఈ జాబితాలో ఇంగ్లండ్ టెస్టు కెప్టెన్ బెన్ స్టోక్స్, స్టార్ ఆల్ రౌండర్ సామ్ కర్రాన్, న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ వంటి ఆటగాళ్లు ఉన్నారు. కాగా ఈ లిస్టులో భారత్ నుంచి ఒక్క ఆటగాడి పేరు కూడా లేకపోవడం గమనార్హం.ఈ ఏడాది ఐపీఎల్ దూరమైన ఇంగ్లండ్ స్టార్ ఆటగాళ్లు బెన్ స్టోక్స్, సామ్ కర్రాన్ కోసం మినీ వేలంలో ఫ్రాంఛైజీలు పోటీపోడే అవకాశం ఉంది. కాగా గతేడాది చెన్నై సూపర్ కింగ్స్కు ప్రాతినిథ్యం వహించిన సామ్ కర్రాన్ను మళ్లీ అదే ఫ్రాంచైజీ దక్కించుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం.అదే విధంగా కేన్ విలియమ్సన్ విడిచి పెట్టిన సన్రైజర్స్ హైదరాబాద్.. స్టోక్స్ను ఈ వేలంలో ఎలాగైనా సొంతం చేసుకుని సారథ్య బాధ్యతలు అప్పజెప్పాలని అనుకుంటున్నట్లు తెలుస్తోంది. ఏదైనా గానీ వీరిద్దరికి మాత్రం వేలంలో భారీ ధర దక్కడం ఖాయంగా కన్పిస్తోంది.ఇక? వీరిద్దరూ ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. ఫైనల్లో సంచలన ఇన్నింగ్స్ ఆడి ఇంగ్లండ్ను బెన్ స్టోక్స్ విజేతగా నిలపగా.. సామ్ కర్రాన్ టోర్నీ ఆసాంతం అదరగొట్టాడు. ఇక ఈ మెగా టోర్నీలో మొత్తం 13 వికెట్లు పడగొట్టిన కర్రాన్.. ప్లేయర్ ఆఫ్ది టోర్నమెంట్గా ఎంపికయ్యాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190